

వైసీపీ హయాంలో ఇసుకను బంగారంగా మార్చి బొక్కేశారు. ఇసుక పాలసీల పేరుతో నిర్మాణ దారులకు చుక్కలు చూపారు. భవన నిర్మాణ కూలీలకు పనులు లేకుండా చేశారు. పాలకులేమో రూ.కోట్లు కొట్టేశారు. ఇసుక అక్రమాలకు చెక్ చెప్తూ.. అందరికీ అందు బాటులోకి తెస్తూ.. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేలా.. కూలీల ఉపాధికి ఢోకా లేకుండా.. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వ పాలసీ ప్రకారం ఎక్కడా కూడా ఇసుక సరఫరా జరగడం లేదని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియజేస్తున్నాయి. గతంలో ఏవిధంగా అయితే వసూలు చేశారో ఆ ప్రకారంగానే ప్రస్తుతం కూడా ఇసుకను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుకతో బ్రోకర్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో ఉచిత ఇసుక లబ్ధి నిర్మాణదారులకు అందడంలేదని తెలుస్తోంది. స్టాక్ యార్డుల్లో కూడా బ్రోకర్ల హవానే కొనసాగు తోంది. దీంతో ఉచిత ఇసుక కోసం వెళ్లిన సామా న్యులకు సక్రమంగా అందడంలేదని సమాచారం. అధికా రులు కూడా బ్రోకర్లకు సహకరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఈ క్రమంలో నిర్మాణదారులు ఇసుక రూపంలో దోపిడీకి గురవడం పరిపాటిగా మారింది. అధి కారులు కలగ చేసుకొని ఉచిత ఇసుక విధానం సక్రమంగా జరిగేటట్లు చూడాలని పలువురు కోరుతున్నారు.

బ్రోకర్లకే.. ఉచితం




పిట్టలవానిపాలెం మండలంలో ట్రాక్టర్లలో తరలిపోతున్న ఇసుక

ప్రభుత్వం మారినా ఆగని దందా

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైసీపీ ఇసుక పాలసీని రద్దు చేస్తూ చంద్రబాబు ఉచిత ఇసుకను ప్రవేశపెట్టారు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. ఐదేళ్లు ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడిన ఇసుకాసురులు కొత్త ప్రభుత్వంలోనూ ఇసుక దందా కొనసాగి స్తున్నారు. దీంతో ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వస్తు న్నాయి. బినామీ పేర్లతో ఉచిత ఇసుకను బ్లాక్ చేసి గతంలోలానే విక్రయి స్తున్నారు. ఇదిలా ఉంటే చాలా చోట్ల ఇంకా నిబం ధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ఇసుక మాఫియాను నడిపించిన నేతలే నేటికీ అదే రీతిలో దందా నడిపించడం గమనార్హం.

- వినియోగదారులకు అందని ఉచిత ఇసుక
- డంపింగ్ యార్డుల వద్ద బ్రోకర్లదే హడావుడి
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వ పాలసీ అభాసుపాలు
- యథావిధిగానే దోపిడీకి గురవుతున్న నిర్మాణ దారులు
- పలు ప్రాంతాల్లో వైసీపీ నేతల అనుచరుల దందా
- స్టాక్ యార్డుల వద్ద వారికి సహకరిస్తున్న అధికారులు

బాపట్ల, అచ్చంపేట, తుళ్లూరు, అమరావతి, కొల్లిపర/బాపట్ల (ఆంధ్రజ్యోతి), జూలై 27: ఇసుకను ఉచితంగా అందిస్తున్నాం. నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా చార్జీలు వసూలు చేయాలి. గత ప్రభుత్వంలో జరిగినట్లు అక్రమాలు జరగడానికి వీల్లేదు. వినియోగదారులు దోపిడీకి గురి కాకూడదు. ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు ఇసుక విషయంలో జోక్యం వద్దు.. ప్రభుత్వానికి అప్రతిష్ఠ రాకూడదు. సామాన్యులకు ఉచిత ఇసుక అందాలి. నిర్మాణదారులకు లబ్ధి చేకూరాలి. కూలీలకు పుష్కలంగా పనులు ఉండాలి.. అని ముఖ్యమంత్రి చంద్ర బాబు చెప్తున్నారు. అయితే ఎక్కడా కూడా చంద్రబాబు చెప్పినట్లు జరగడంలేదు. ఉచిత ఇసుకలో అక్రమాలు జరగకుండా ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే ఆ ప్రకారం డంపింగ్ యార్డుల వద్ద ఇసుక లోడింగ్ కానీ, రవాణా కానీ జరగడంలేదు. డంపింగ్ యార్డుల వద్ద ఇసు క బ్రోకర్లదే రాజ్యమన్నట్లుగా పరిస్థితి ఉంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ అభాసు పాలవుతుంది. కొందరు బ్రోకర్లు నిర్దేశించిన ప్రకారమే లోడింగ్, రవాణా జరుగుతుంది.


అమరావతి: వైకుంఠపురం రీచ్‌లో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

వందలాది లారీల ద్వారా కొందరు జేబులు నింపుకుంటున్నారు.

బుసక ముసుగులో ఇసుక

బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో బుసక ముసుగులో ఇసుకను పెద్దఎత్తున తరలిస్తున్నారు. తాను అధికారపార్టీ నాయకుడ్ని అడ్డుకునే వారెవరంటూ ఓ నేత చెలరేగి పోతున్నాడు. కర్లపాలెం మండలం నల్లమోతు వారిపాలెం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుకను తరలించారు. ప్రభుత్వం మారినా వైసీపీ ద్వితీయశ్రేణి నేతల కనుసన్నల్లో వెస్ట్ బాపట్ల మహాత్మా


వెస్ట్‌బాపట్ల పరిధిలోని మహాత్మాజీపురంలో నిల్వచేసిన ఇసుక దిబ్బలు

జీపురం శివారుల్లో రాత్రిపూట ఇసుక తరలి పోతోంది. దరివాద కొత్తపాలెం వైసీపీ నాయకులు కూడా ఇసుక దందాలో ఇంకా కీలకంగా వ్యహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బాపట్ల, చీరాల మండలాల సరిహద్దుల్లోని అడవి గ్రామ పంచాయతీ పరిధి ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ వద్ద బుసక పేరిట తవ్వి లే అవుట్లలో మెరకలకు ఉపయోగిస్తున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో పొలాలను సైతం తవ్వి తరలిస్తున్నారు. కొన్నిచోట్ల కాల్వకట్టలను సైతం తవ్వేస్తున్నారు. బాపట్లకి చెందిన ఓ వైసీపీ నేత బినామీల ద్వారా ఉచిత ఇసుకను అక్రమంగా తెప్పించుకుని అధిక ధరకు విక్రయిస్తుండగా ఇటీవల అధికారులు దాడులు చేశారు. ఇసుక దందాలో బాపట్ల రూరల్ పరిధిలోని ఓ వైసీపీ నేతే ఇప్పుడు కూడా కీలకంగా ఉంటున్నాడు. ఇతడికి అధికారపార్టీలోని ద్వితీయశ్రేణి నేతల్లో కొందరు సహకరిస్తున్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారి పాలెం, గణపవరం పరిసరప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నల్ల మోతువారిపాలెంలో జాతీయ రహదారి పక్కనే రెండు ఎకరాల భూమిని 8 అడుగుల ఎత్తున ఇసుకతో మెరక చేసి చుట్టూ ప్రహరీ కట్టి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధమయ్యారు. హైవేపై రాకపోకలు సాగించే అధికారులకు ఇది కనిపించకపోవడం విచిత్రం. పిట్టలవానిపాలెం మండలం చందోలు, రెడ్డిపాలెం, జీఎస్‌పాలెం, అల్లూరు పరిసరప్రాంతాల్లో ఇసుక అక్రమ విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుకతోపాటు నల్లమట్టిని కూడా తరలిస్తున్నారు. చీరాల మండలం దేవినూతల గ్రామం నుంచి ఇసుకను తరలిస్తూ ఓ దళారి యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నాడు. బాపట్ల పరిసరప్రాంతాల్లో స్థలాల మెరక చేయాలంటే కాంట్రాక్ట్ తీసుకుని జేబులు నింపుకుంటున్నాడు. గత వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా ఇసుక విక్రయాలు జరిపిన ఇతడే ప్రస్తుతం ఉన్న పాలకులను ప్రసన్నం చేసుకుని ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నాడు.

- అచ్చంపేట మండలం కోనూరులో యార్డులో దూర ప్రాంతాల నుంచి వచ్చిన లారీలకు సకాలంలో లోడింగ్ జరగడం లేదు. ఆలస్యంగా వచ్చిన లారీలకు బ్రోకర్లు ముందుగా స్లిప్పులు రాయించి లోడు చేయిస్తున్నారు. ఈ విషయంలో రెండు రోజుల క్రితం గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. ఓ పార్టీకి చెందిన నాయకులు బెదిరించి ఇసుక తీసుకెళ్తున్నారని తెలిసింది.
- తుళ్లూరు మండలం లింగాయపాలెం స్టాక్ పాయింట్‌లో స్థానికత పేరుతో ఓ వైసీపీ నేత అనుచరుల హవా సాగుతుంది. అడ్డదారులలో వచ్చి వాహనాలను ముందు సీరియల్‌లో పెట్టి లోడింగ్ స్లిప్‌లు ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నారు. గతంలో ఇసుక దందాలు చేసిన ఉద్దండ్రాయుపాలెంలో వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు ఇప్పుడు కూడా వాహనాల్లో వచ్చి బెదిరించి టోకెన్లు తీసుకుని ఇసుకను తరలించుకుపోతున్నారు.
- కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో గందరగోళం కొన సాగుతోంది. నాయకులు తమకు ఇష్టం వచ్చిన వారికి టోకెన్లు ఇస్తున్నట్లు ఇసుక కోసం వచ్చిన వాహనదారులు శుక్రవారం తనిఖీలకు వచ్చిన జేసీ భార్గవ్ తేజ ఎదుటే వాపోయారు. ఉచిత ఇసుక విధానం బాగున్నా స్టాక్ పాయింట్లలో నాయకులు, బినామీల కారణంగా సక్రమంగా అమలు కావడం లేదన్నారు.
- అమరావతి మండలం వైకుంఠపురం రీచ్‌లో నేతల బంధువులు, వారి అనుచరులు ఇసుక లోడింగ్‌కు వాహనాలు రాకముందే వేర్వేరు ఆధార్ నెంబర్లతో బుక్ చేసుకుంటున్నారు. అదనంగా రూ.వెయ్యి ఇచ్చిన వారికి ఇసుకను విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకెళ్లిన ఇసుకను రూ.16 వేల వరకు విక్రయిస్తున్నారు. 20 టన్నుల ఇసుక గుంటూరుకు 12 వేలకు చేర్చాల్సి ఉండగా వాహన యజమానులు అధికంగా వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వచ్చిన వాహనాలు సరియైన సమయంలో లోడింగ్ కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ హయాంలో ఇసుక మాఫియాలో పాలుపంచుకున్న వారు ప్రస్తుతం పార్టీ మారి రీచ్‌ల్లో తిష్ఠ వేసి ఇసుక దందా కొనసాగిస్తున్నారు.


కొల్లిపర ఇసుక స్టాక్ పాయింట్‌లో శుక్రవారం లోడింగ్ చేసే విధానాన్ని పరిశీలిస్తున్న జేసీ భార్గవ్‌తేజ


అచ్చంపేట: కోనూరులో ఇసుక డంపింగ్ యార్డులో లారీలకు లోడు చేస్తున్న దృశ్యం

టెక్స్‌టైల్ పార్కా.. చేనేత పార్కా..?


ముళ్లచెట్లతో మూసుకుపోయిన చేనేత పార్కు స్థలం

- చీరాలలో దేనిని ఏర్పాటు చేస్తారో?
- 2005లో టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన
- టెక్స్‌టైల్‌తో మరో సిరిసిల్లేనంటున్న చేనేతలు
- చేనేత పార్కుకు రూ.9 కోట్లతో ప్రతిపాదనలు
- చేనేత దినోత్సవం నాటికి కార్యాచరణకు రూపువచ్చేనా..

చీరాల, జూలై 27: చేనేతల ఖిల్లా చీరాల. రెండున్నర దశాబ్దాల క్రితం చీరాల నియోజకవర్గంలో సుమారు 25 వేల మగ్గాలు ఉండేవి. ఈపురుపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు చేనేత మగ్గాల లయబద్ధ చప్పుళ్లు శ్రావ్యంగా వినిపించేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 8,700 కు పడిపోయింది. అంటే చేనేత రంగం ఎంత సంక్షోభంలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితుల్లో సుమారు రెండు దశాబ్దాలుగా ఇక్కడ నేతన్నలను ఆదుకునే విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా ఉన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చీరాల చేనేతల సంక్షేమం తెరపైకి వచ్చింది. అయితే ఎప్పటి నుంచో ఊరిస్తూ వస్తోన్న చేనేత పార్కు.. లేదా టెక్స్‌టైల్ పార్కు ఏది చీరాలలో ఏర్పాటు అవుతుందా అన్న చర్చ జరుగుతుంది. గత కొంతకాలంగా నాయకులు పదే, పదే టెక్స్‌టైల్ పార్కు తెస్తామని ప్రకటిస్తున్నారు. అయితే 2005లో అప్పటి రాష్ట్ర మంత్రి కొణిజేటి రోశయ్య టెక్స్‌టైల్ పార్కుకు వేటపాలెం మండలం నాయినిపల్లి పరిధిలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత చేనేత రంగానికి చెందిన కొందరు టెక్స్‌టైల్ పార్కుతో సాధారణ చేనేత కార్మికులకు నష్టం చేకూరుతుందని చెప్పడంతో దానిని చేనేత పార్కు(హ్యాండ్లూమ్ పార్కు)గా మార్చారు. అయితే పాలకులు పదే, పదే చెప్తున్న టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం జరిగితే చీరాల కూడా మరో సిరిసిల్లగా మారుతుందన్న చేనేత వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హ్యాండ్లూమ్ పార్కుతోనే అందరికి ప్రయోజనం చేకూరుతుందంటున్నారు.


టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి అప్పటి మంత్రి రోశయ్య వేసిన శిలాఫలకం

వ్యత్యాసం ఇదీ..

టెక్స్‌టైల్ మార్కు అంటే పవర్‌లూమ్స్, మర మగ్గాలు వస్తాయి. చేతి వృత్తి నామమాత్రంగానే ఉంటుంది. దీంతో సగటు చేనేత కార్మికులకు పని దొరకటం గగనం అవుతుంది. అదే హ్యాండ్లూమ్ పార్కు అయితే చేనేత కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయి. ఇప్పటికే చేనేత కార్మికులు తాము నేసిన వస్త్రాలను విక్రయించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చెలామణి కావడం ఇందుకు కారణం. ఇక టెక్స్‌టైల్ పార్కు ఏర్పడితే పవర్‌లూమ్‌లతో తయారీ అధికారికంగా జరుగుతుంది. సిరిసిల్లలో పవర్‌లూమ్స్ తాకిడి సగటు చేనేత కార్మికుల భృతికి భగ్నం కలిగింది. ఆకలి కేకలతో ఆత్మహత్యలు పరంపర కొనసాగింది.

ఆత్మహత్య.. ఆందోళనలు

2005లో చీరాల మండలం పరిధిలో అవ్వారు సుబ్బారావు, మహాలక్ష్మమ్మ అనే దంప తులు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పలువురు చేనేత కార్మిక ప్రతినిధులు పోరాటాలు, అభ్యంతాల క్రమంలో టెక్స్‌టైల్ పార్కును, హ్యాండ్లూమ్ పార్కుగా మార్చారు. అయితే ప్రస్తుతం టెక్స్‌టైల్ పార్కు పేరును పాలకులు పదే, పదే ఉచ్చరించడంతో నేతన్నలు సందిగ్ధంలో పడుతున్నారు. వీరు పొరపాటున టెక్స్‌టైల్ పార్కు అని చెప్తున్నారా..? లేక నిజంగా టెక్స్‌టైల్ పార్కునే నిర్మాణం చేస్తారా అని చర్చించుకుంటున్నారు. హ్యాండ్లూమ్ పార్కుకు సంబంధించి ఎంఎస్‌ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజస్) క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ క్రింద రూ.9 కోట్లు అంచనాతో డీపీఆర్ తయారుచేసిన అధికారులు ప్రభుత్వానికి పంపారు. పార్కు నిర్మాణానికి గతంలో 50 ఎకరాలు కేటాయించగా ప్రస్తుతం 26.81 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. పార్కు అంచనా విలువ రూ.769.63 లక్షలు కాగా అందులో కేంద్రం వాటా రూ.618.96 లక్షలు, రాష్ట్రం వాటా రూ.150.67 లక్షలు. ఈ నేపథ్యంలో తొలి విడత రూ.172.75 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో సదరు పార్కులో ప్లాట్లు కేటాయింపునకు సంబంధించి అడ్వాన్సుగా లబ్ధిదారుల సుమారు 150 మంది రూ.10 వేలు చొప్పున ధరావత్తు చెల్లించారు. ఆ తర్వాత కాలయాపన జరుగుతుండటంతో ఆ సొమ్మును కొందరు వెనక్కు తీసుకోగా ఇంకా కొందరి మొత్తాలు డిపార్ట్‌మెంట్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే నిధుల దుర్వినియోగంతో అప్పటి ఏడీ సత్యన్నారాయణరాజును ఉద్యోగం నుంచి తొలగించారు.

తీరంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు


సముద్ర తీరంలో గజ ఈతగాళ్లకు సూచనలు చేస్తున్న డీఎస్పీ మురళీ కృష్ణ

బాపట్ల, జూలై 27: జిల్లాలోని సూర్యలంక సముద్రతీరంతోపాటు ఓడరేవు, రామాపురం బీచ్‌ల వద్ద పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సూర్యలంక సముద్రతీరంలో తీసుకుంటున్న చర్యలను శనివారం డీఎస్పీ సి.హెచ్ మురళీకృష్ణ పరిశీలించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తీరంలోని బీచ్‌లకు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగినవిధంగా భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకులు ప్రమాదాలకు గురైతే రక్షించడానికి గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతు వరకు మాత్రమే పర్యాటకులను అనుమతించాలన్నారు. ఆ ప్రాంతంలో ఎరుపు రంగు జెండాలను ఏర్పాటు చేసి వాటిని దాటకుండా చూడాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, మెరైన్ సిబ్బంది తీరంలో అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా గస్తీ నిర్వహించాలని సూచించారు. మద్యం తాగి సముద్రంలోకి దిగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆకతాయిలు పర్యాటకులను ఇబ్బంది పెడితే వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు ఔట్‌పోస్ట్, వాచ్‌టవర్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీహరి, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

7లో..

వికటించిన వైద్యం.. ఒకరి మృతి


ఆర్‌ఎంపీపై పోలీసులకు బంధువుల ఫిర్యాదు

ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలు మార్గంలో ట్రాఫిక్ బ్లాక్

- రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్





studio green
STUDIO GREEN FILMS (P) LTD.
K.E.GNANAVELRAJA & AADHANA GNANAVELRAJA
ALLU SIRISH'S
బడ్డీ
WRITTEN & DIRECTED BY
SAM ANTON
CO-PRODUCED BY NEHA GNANAVELRAJA
PRODUCED BY
KE GNANAVELRAJA
AADHANA GNANAVELRAJA
IN CINEMAS
AUGUST 2ND
Junglee


కనిపించేదంతా మున్నేత్రుడి మర్మమే
1ST AUG
IN THEATRES
శివం భజే
MAHESWARA REDDY MOOLI APSAR


VIJAYA BHASKAR KRAFT
ఆగస్టు
2
బ్రహ్మాండమైన
విడుదల
A VIJAYA BHASKAR FILM
SREE KAMAL TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY
VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA MUSIC RR DHRUVAN
Pre Release Event
ON SUNDAY
28.7.2024


INFINITI
IN THEATRES
AUGUST 2ND
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
SCRIPT | DOP | DIRECTION SD VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHAA | B.PRADEEP | PANKAJ BOHRA
ANDHRA PRADESH & NIZAM THEATRICAL RIGHTS CONTROLLED BY: PADMAKAR CINEMAS


DHANUSH
MASSIVE
BLOCKBUSTER
KALANITHI MARAN
PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL


SVC RELEASE
అలనాటి
రామచంద్రుడు
IN CINEMAS
AUG 2nd


TRISHA
AUGUST
2ND
IN THEATERS
తిరగబడరసామి...
MALKAPURAM SHIVAKUMAR
A S RAVIKUMAR CHOWDARY

యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలి

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


రక్తదానం చేసిన విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జూలై 27: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పిలుపునిచ్చారు. శనివారం డాక్టర్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్ ఎస్ఎస్ విభాగం వారు జీజీహెచ్ గుంటూరు, నీడ్స్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్, తలసేమియా నీడ్స్ బ్లడ్‌బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు సెకన్లకు ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరికి రక్తం అవసరం అవుతూనే ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తాము రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. రక్తదానం చేశాక శరీరం తాను కోల్పోయిన రక్తాన్ని 48 గంటల్లోగా తిరిగి భర్తీ చేసుకుంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమడ ఆధునీకరించి గుంటూరు చానల్ పొడిగించేందుకు కృషి

● రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

బాపట్ల, జూలై 27: కోస్తా జిల్లాల ప్రధాన సమస్యగా ఉన్న నల్లమడ డ్రెయిన్ ఆధునీకరణతోపాటు గుంటూరు చానల్ పొడిగించేందుకు కృషి చేస్తానని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. వ్యక్తిగత పనుల నిమిత్తం తన స్వగ్రామమైన బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి శనివారం వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా నల్లమడ ఉందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఆధునీకరణకు కేటాయింపులు చేసినప్పటికి ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి వాటిని నిలుపుదల చేశారన్నారు. డ్రైనేజి వ్యవస్థ అంతా అస్థవ్యస్థమైపోయిందన్నారు. పంటపొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడిందన్నారు. వీటన్నిటిపై సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగించటంతోపాటు మెట్టపొలాలకు ఎత్తిపోతల పథకాలు కూడా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వానికి కొంత ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు.నిధులన్నీ సమీకరించుకుంటూ ఒకవైపు అప్పులు తీర్చుకుంటూ మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిఉందన్నారు. ఎన్డీయే సహకారంతో నిధులు సమీకరించి రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

మండల్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిందే

● ఆగస్టు 7న చలో అమృత్‌సర్‌ను విజయవంతం చేయాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, జూలై 27: మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 7న మండల్‌డే సందర్భంగా పంజాబ్ అమృత్‌సర్‌లో జరగనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభకు బీసీలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా బడ్జెట్లో కేటాయింపులు జరపాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా కులజనగణన పారదర్శకంగా చేపట్టాలని కోరారు. విద్య, ఉద్యోగాలలో అమలవుతున్న 27శాతం రిజర్వేషన్లను, బీసీల జనాభా దామాషా మేరకు పెంచాలన్నారు. చట్టసభల్లోనూ ఆ మేరకు రిజర్వేషన్లు ఇచ్చేలా పార్లమెంటు చట్టాలు చేయాలని కోరారు. ఆగస్టు 7 రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో బీపీ మండల్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు. ఓబీసీ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, రాష్ట్ర యువజన ప్రధానకార్యదర్శి కె.హనుమంతు, పి.మహేష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.


మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయటమే లక్ష్యం

● త్వరలో పేట ప్రజలకు అందుబాటులోకి మినరల్ వాటర్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 27: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రెండు మూడు నెలలుగా పట్టణవాసులకు ఏర్పడిన తాగునీటి సమస్యకు చరమగీతం పాడనున్నామని, పట్టణ వాసులకు తాగునీటి సమస్య లేకుండా చేయటమే తన ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం మంచి నీటి చెరువు వద్ద మోటార్ల ద్వారా నీటిని నింపుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేట తాగునీటి సమస్యను నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్లామని, ఐదు టీఎంసీల నీరు పట్టణ వాసుల తాగునీటి అవసరాలకు సరి పోవని, మరో మూడు టీఎంసీల నీరు అదనంగా కావాలని అడిగి వారిని ఒప్పించామన్నారు. నీటి విడుదల వచ్చే నెల 6వ తేదీ వరకు ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు. ఇక నుంచి పట్టణంలోని మెరక ప్రాంతాల్లో కూడా నీటి సమస్య లేకుండా నీటి పరిమాణాన్ని పెంచి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌టీఆర్ సుజల ద్వారా రూ.2కే మినరల్ వాటర్‌ను ఆగస్టు 10వ తేదీ నుంచి పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న 25 ఔట్‌లెట్‌ల ద్వారా ప్రజలకు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. టిడ్కో నివాస గృహాల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అందులో భాగంగానే పట్టణ సీఐని పల్లెనిద్ర చేయాలని ఆదేశించామని, త్వరలో తాను కూడా స్వయంగా టిడ్కో గృహాల వద్ద పల్లెనిద్ర చేస్తానని తెలిపారు. టిడ్కో గృహాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నాడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ 52 ఎకరాల సముదాయంలో కట్టిన 4500 ఇళ్లను అర్హులకే అందించి ప్రజలు ఇక్కడ నివాసం ఉండేలా చర్యలు తీసుకోనున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.'

సమాజ హితమే యువ ఇంజనీర్ల లక్ష్యం కావాలి

● మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో ముందుకు సాగండి

● ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ

● అట్టహాసంగా ఆర్వీఆర్‌జేసీలో గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు(విద్య), జూలై 27: యువ ఇంజనీర్లు సమాజ హితం కోసం పనిచేస్తూ, మేక్ ఇన్ ఇండియా ఆలోచనలతో ముందుకుసాగాలని ఇస్రో డైరెక్టర్ బీఎన్ రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 36వ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. యువత ప్రతి సమస్యను ఛాలెంజ్‌గా తీసుకుని దాని పరిష్కారం కోసం కృషిచేయాలని రామకృష్ణ అన్నారు. స్వతంత్ర ఆలోచనలు, సమష్టికృషి ఎంతోముఖ్యమని సూచించారు. ప్రపంచస్థాయిలో అంతరిక్ష పరిశ్రమలో 300 బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని, ఇందులో భారతదేశ వాటా కేవలం 2శాతం మాత్ర మేనని దీనిని మరింతపెంచేలా నేటి యువత కృషి చేయాలన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రపంచస్థాయి నైపుణ్యాలను అందిపుచ్చుకున్నవారికే మెరుగైన అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీశ్ కుమార్ మద్దినేని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, డీన్స్, వివిధ శాఖల విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ బ్రాంచీల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.


చదువులో ప్రతిభ చూపిన విద్యార్థినికి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న ఇస్రో డైరెక్టర్ రామకృష్ణ, ఏఎన్‌యూ వీసీ గంగాధర్, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

వికటించిన వైద్యం.. ఒకరి మృతి

ఆర్‌ఎంపీపై పోలీసులకు బంధువుల ఫిర్యాదు


ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డి


శ్రీను మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఇన్‌సెట్‌లో శ్రీను మృతదేహం



వినుకొండటౌన్, నూజండ్ల, జూలై 27: వైద్యం వికటించి ఓ రైతుకూలీ మృతి చెందిన సంఘటన వినుకొండలో శనివారం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు సమాచారం మేరకు వివరాలు.. నూజండ్ల మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన తాటి శ్రీను (30) గొర్రెలు కాసుకునేవాడు. ఈ క్రమంలో కాలి బొటన వేలుకు గాయం కాగా బుర్రిపాలెం సమీపంలోని రవ్వారంలోని ఆర్ఎంపీ సిహెచ్.మల్లికార్జునరెడ్డి వద్దకు చికిత్సకు వెళ్లాడు. గాయానికి వైద్యం చేసి, అనంతరం నొప్పికి ఇంజక్షను చేశాడు. కొద్ది సేపటికి శ్రీనుకు ఒళ్ళంతా మంటలు రావడంతో పాటు, ఒంటిపై బొబ్బలు వచ్చి, ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. దీంతో ఆర్ఎంపీ వెంటనే శ్రీనును ఆటోలో వినుకొండ వైద్యశాలకు తరలించాడు. అప్పటికే శ్రీను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు, శ్రీను బంధువులు పెద్ద సంఖ్యలో వినుకొండ వైద్యశాల వద్దకు చేరుకున్నారు. శ్రీనుకి భార్య ఆదిలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని శ్రీను కుటుంబ సభ్యులు నూజండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరారీలో ఆర్ఎంపీ

శ్రీను మృతి చెందాడని సమాచారం మేరకు బంధువులు పెద్ద సంఖ్యలో వినుకొండ ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో ఆర్ఎంపీ అక్కడ నుంచి పరారయ్యాడు. తన బావమరిది సాయంతో రాజీకి ప్రయత్నించినప్పటికీ శ్రీను బంధువులు ససేమిరా అన్నారు. ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డి నరసరావుపేట పార్లమెంట్ వైసీపీ వైద్యవిభాగం జనరల్ సెక్రటరీ.

ఆర్ఎంపీని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే జీవీ

తెలిసీతెలియని వైద్యంతో పేద రైతు కూలీని బలితీసుకున్న ఆర్ఎంపీ మల్లికార్జునరెడ్డిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. జీవీ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి శ్రీను మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఎక్స్పైరీడేట్ ఇంజక్షన్ చేయడంతో అది వికటించి చనిపోయాడన్నారు. జనసేన పార్టీ నాయకులు కొణిజేటి నాగ శ్రీను, మండల అధ్యక్షుడు మురళీకృష్ణయాదవ్, మీసాల ఆంజనేయులు, గరునాథం, సోమేపల్లి బ్రహ్మయ్య, రోడ్డా వీరాంజనేయరెడ్డి, గంగినేని బాబు, ఎర్రయ్య తదితరులు వారి వెంట ఉన్నారు.

తెనాలికి చేరుకున్న హారిక మృతదేహం

● ఈ నెల 20న అమెరికాలో కారు ప్రమాదంలో మృతి

● ఐతానగర్‌లోని స్వగృహం వద్ద అంత్యక్రియలు పూర్తి

● శోకసంద్రంలో మునిగిన కుటుంబీకులు, బంధువులు




తెనాలి ఐతానగర్‌లో హారిక మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్లో హారిక ఫైల్‌ఫోటో

తెనాలి రూరల్, జూలై 27: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెనాలికి చెందిన విద్యార్థిని జెట్టి హారిక(25) అక్కడి హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందింగా ఆమె భౌతికకాయం శనివారం తెనాలికి చేరుకుంది. ఆమె మృతదేహాన్ని స్వస్థలానికి తెప్పించేలా సహాయం అందించాలని కుటుంబసభ్యులు కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. దీంతో స్పందించిన వారు తగిన ఏర్పాట్లు చేయగా శనివారం హారిక భౌతికకాయం తెనాలి చేరింది.

తెనాలి ఐతానగర్‌కు చెందిన హారిక గత సంవత్సరం ఆగస్టులో న్యూట్రిషన్ ఫుడ్ సైన్స్‌లో మాస్టర్స్ చేసేందుకు అమెరికా వెళ్లారు. యూనివర్సిటీ నుండి కారులో ఇంటికి వస్తుండగా ఈ నెల 20న కౌంటీలోని ఒకహోమా హైవేపెట్రోల్-74 దగ్గర వరుసగా మూడు కార్లు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రయాణంలో హారిక అక్కడికక్కడే మరణించింది. కాంట్రాక్ట్ ఉద్యోగి అయిన ఆమె తండ్రి ఆర్థిక స్తోమతలేకున్నా కూతురి ఉన్నత చదువుల కోసం అప్పుచేసి మరీ అమెరికాకు పంపారు. ఉన్నత విద్యనభ్యసించి గొప్ప స్థాయిలో తిరిగివస్తుందని ఆశించిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు హారిక మృతి తీరనిశోకాన్ని మిగిల్చింది. హారిక భౌతికకాయం వద్ద తల్లిదండ్రులు, సోదరుడు, కుటుంబసభ్యులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. దీంతో ఆ ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలు పూర్తి

అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లి ప్రమాదవశాస్తూ మృతి చెందిన తాడిబోయిన రవితేజ, జెట్టి హారిక భౌతికకాయాలకు శనివారం అంతిమయాత్ర నిర్వహించి ఆయా కుటుంబసభ్యులు దహన సంస్కారాలు పూర్తిచేశారు. ఆ కార్యక్రమాలలో కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలు మార్గంలో ట్రాఫిక్ బ్లాక్

● రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 12, 13 తేదీల్లో నడికుడి రైలుమార్గంలోని విష్ణుపురం-కొండ్రపోలు మధ్యన ట్రాఫిక్‌ని బ్లాక్ చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆయా తేదీల్లో నెం.17646 రేపల్లె-సికింద్రాబాద్ నాలుగు గంటల ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు. నెం.17230 సికింద్రాబాద్-త్రివేండ్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్ 75 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేస్తామన్నారు. నెం.07222 సంత్రగచి-సికింద్రాబాద్ రైలు ఆగస్టు 11న, నెం.07221 సికింద్రాబాద్-సంత్రగచి స్పెషల్ ఆగస్టు 13న నడికుడి మార్గంలో కాకుండా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదగా దారి మళ్లిస్తామన్నారు. నెం.12805 విశాఖపట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఆగస్టు 12, 13 తేదీల్లో మార్గమధ్యంలో 45 నిమిషాల పాటు క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించి రైల్వేకి సహకరించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

కాచిగూడ - తిరువన్నామలై రైలులో చోరీ

● మహిళ మెడలో బంగారు చైన్ లాక్కెళ్ళిన దొంగ

రాజుపాలెం, జూలై 27: కాచిగూడ నుంచి తిరువన్నామలై వెళ్ళే రైలులో చోరీ జరిగిన సంఘటన మండలంలోని రెడ్డిగూడెం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. నడికూడి రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సికింద్రాబాద్‌లోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన బీశెట్టి దేవీప్రియ తన కుటుంబంతో కలసి కాచిగూడ - తిరువన్నామలైలో అరుణాచలం వెళ్తున్నారు. వీరు ఎస్-2 బోగీలో ప్రయాణిస్తున్నారు. రాత్రి 12.50 గంటల సమయంలో ఈ రైలుకు రెడ్డిగూడెంలో క్రాసింగ్ ఉండటంతో రైలు ఆగింది. క్రాసింగ్ అయి పోగానే 12.55, ఒంటి గంట సమయంలో రైలు కదిలింది. ఆ సమయంలో దొంగ చాకచక్యంగా దేవీప్రియ మెడలో ఉన్న 29 గ్రాముల బంగారపు చైన్‌ను తెంచుకొని ట్రెయిన్ దిగి పరారయ్యాడు. ఆమె కేకలువేయటంతో అప్పటికే ట్రెయిన్ కదలటం జరిగిపోయింది. ఈ సంఘటనపై ఆమె గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు నడికూడి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

రాజీకి పిలిచినందుకు దాడి

● ఆరుగురు నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట జూలై 27: కేసు విషయంలో రాజీకి పిలిచినందుకు దాడి చేసిగాయపర్చిన నిందుతులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరల సమావేశంలో నిందుతుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. దోమ రాకేష్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందని, దానిలో ఫిర్యాదిదారు అయిన తలవరస విజయ్ బాబును కేసును రాజీపడమని రాకేష్ పలుమార్లు అడిగాడని తెలిపారు. ఈసారి రాజీకి రమ్మని అడిగితే నిన్ను చంపుతానని విజయ్ బాబు గతంలో బెదిరించాడు. ఈ క్రమంలో ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో సుల్తానాబాదు సుందరయ్య నగర్ కాలనీలో రాకేష్ తన స్నేహితుడు ఏడుకొండలుతో ఉన్న సంగతి తెలుసుకొని విజయ్‌బాబు మిగతా నిందితులను కలుపుకొని రాకేష్‌ను చంపాలనే ఉద్దేశంతో మారణాయుధాలతో దాడి చేశారన్నారు. వారిపై ముకుమ్మడిగా రాడ్లు, కర్రలతో, రాళ్ళతో విచక్షణా రహింతంగా కొట్టగా దోమ రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. రాకేష్‌ను అతని స్నేహితుడు ఏడుకొండలును చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఆదే రోజు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. శనివారం ఏ1 నిందితుడైన తలవరస విజయ్‌బాబు ఇంటిదగ్గర మొత్తం ఆరుగురు నిందుతులను త్రీటౌన్ ఎస్సై ప్రకాష్‌రావు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఈ ఆరుగురు నిందుతులలో ఇద్దరు పలు నేరాలలో నిందుతులని, వారిపై రౌడీషీట్ కూడా ఉందన్నారు. ఇటువంటి వారిపై పీడీ యాక్ట్‌ను, అవసరమైతే నగర బహిష్కరణను కూడా విధిస్తామని హెచ్చరించారు. నిందితులను పట్టుకున్న త్రీటౌన్ సీఐ రమేష్‌బాబును, ఎస్సై ప్రకాష్‌రావును, పోలీసు సిబ్బందిని డీఎస్పీ రమేష్ అభినందించారు.

ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు(విద్య), జూలై 27: నల్లపాడులోని ప్రభుత్వ టెక్స్‌టైల్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకనటలో తెలిపారు. పాలిసెట్ అర్హత సాధించకపోయినా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29వ తేదీ లోపు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్ జిరాక్స్‌ను జత చేసి కళాశాలలో సమర్పించాలని సూచించారు. పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదవ తరగతి మార్కుల జాబితా. పదవ తరగతి టీసీ, 4వ తరగతి నుండి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీలకు రూ.700 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించారు. అదేవిధంగా కళాశాల ఫీజు రూ.4700 చెల్లించాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్‌కి వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్లు జిరాక్స్ కాపీలు తప్పకుండా తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఎటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదని స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

డీజీపీని కలిసిన ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, జూలై 27 : ఆంధ్రప్రదేశ్ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావును బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని ఏపీ పోలీసు హెడ్‌క్వార్టర్‌లో కలిసి పూల మొక్క అందజేశారు. బాపట్ల జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన డీజీపీని కలిశారు.


డీజీపీకి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ

మోటారు సైకిల్‌యాత్ర ముగించుకుని వచ్చిన టీడీపీ నాయకులు

బాపట్ల, జూలై 27 : కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావాలని మొక్కుకున్న మాజీ కౌన్సిలర్, తెలుగుదేశం పార్టీ నాయకుడు పులి వాసు, మంగళపురి శ్రీనివాసరావులు ఈనెల 18న అయోధ్య, కాశీ, త్రివేణి సంగమంకు మోటారు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రను ముగించుకొని వచ్చిన వారికి 29వ వార్డు బెస్తపాలెం శ్రీకోదండరామాలయం దగ్గర ప్రజలు, పార్టీ శ్రేణులు స్వాగతం పలికి అభినందించారు. ఈ ప్రయాణం రావటం, పోవటం మొత్తం 4 వేల కిలోమీటర్ల వరకు ఉందని వారు తెలిపారు. ఈ విధంగా ఎన్డీయే కూటమి గెలుపు కోరుతూ యాత్ర చేపట్టటం సంతోషంగా ఉందని పులివాసు అన్నారు. యాత్ర ముగించుకొని వచ్చిన వారిని అభినందించిన వారిలో ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, చాపా సోమయ్య, కె.రమేష్, టి.శేషాద్రి, ఎం.శేషు కృష్ణ ఉన్నారు.


మోటారు సైకిల్‌యాత్ర ముగించుకొని వచ్చిన టీడీపీనాయకుడు పులి వాసు, మంగళపురి శ్రీనివాసరావులను అభినందిస్తున్న స్థానికులు

ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తా : కమిషనర్


వార్డులో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

బాపట్ల, జూలై 27 : పట్టణ ప్రజల ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీ, రామకృష్ణాపురం, గంగపుత్రకాలనీలలో శనివారం ఆయన పర్యటించారు. వార్డులో ఉన్న సమస్యలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ముఖ్యంగా పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఆప్రాంత ప్రజలు కోరారు. తాగునీరు, మురుగునీరు పారుదల వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వీటిపై స్పందించిన కమిషనర్ వెంటనే పరిష్కార మార్గాన్ని చూపించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో సమస్యలన్నిటికి త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఆయన చెప్పారు. కలెక్టర్ జె.వెంకటమురళీ ఆదేశాల మేరకు వార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, రమాదేవి, శీలం శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టణ సమస్యలను పరిష్కరించాలంటూ కమిషనర్‌కి వినతి

బాపట్ల, జూలై 27 : పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శనివారం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మున్సిపల్ కళాక్షేత్రానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. రైల్వేస్టేషన్ వద్ద సులభ కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వివేకానందకాలనీలోని మున్సిపల్ పార్క్‌లో లక్షల విలువ చేసే సామగ్రి తుప్పుపడుతున్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే చర్యలు తీసుకుంటామని హామినిచ్చారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి.రాజారావు, అమ్మేశ్వరరావు పాల్గొన్నారు.

వైసీపీకి దమ్మనవారిపాలెం సర్పంచ్ వెంకటేశ్వరమ్మ రాజీనామా

కర్లపాలెం, జూలై 27 : కర్లపాలెం మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామసర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరమ్మ వైసీపీకి రాజీనామా చేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామ ప్రజల ఆకాంక్ష మేరకు వెంకటేశ్వరమ్మ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జనసేనలో చేరేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.


వెంకటేశ్వరమ్మ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

● యూనియన్ బ్యాంక్ మేనేజర్ కేసాని మానస


హైవెండ్ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న బ్యాంక్ మేనేజర్ కేసాని మానస, సర్పంచ్ వెంకటలక్ష్మి

కర్లపాలెం, జూలై 27 : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కేసాని మానస, ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల లక్ష్మీలు సంయుక్తంగా అన్నారు. ఏట్రవారిపాలెంలోని హైవెండ్ హైస్కూల్‌లో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో తల్లికోసం ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకోసం ప్రతి ఒక్కరు తమవంతుగా ఒక మొక్క నాటాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నామన వెంకటశివన్నారాయణ అన్నారు. పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ఏపీఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, యూనియన్ బ్యాంక్‌సిబ్బంది, పాఠశాల ఛైర్మన్ ఉదయచంద్రరావు, ఎండీ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్ చాందిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

వేమూరు, జూలై 27 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని టీడీపీ బాపట్ల పార్లమెంట్ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని పద్మజ అధ్యక్షతన శనివారం దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయబాబు ముందుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విజయబాబు

ఇంటింట విద్యార్థులు మొక్కలు పెంచాలి

చెరుకుపల్లి, జూలై 27 : మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైన ఉందని ఎంఈవో పి.తాజర్ అన్నారు. శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం చెరుకుపల్లి హైస్కూల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటటం గ్రామాల్లో ఎంతో అవసరం అని విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా గుళ్ళపల్లి హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నవీన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా విద్యా విధానంలో మార్పులు

వేమూరు, జూలై 27 : రాష్ట్రంలో విద్యాశాఖ విధానాన్ని జగన్ ప్రభుత్వంలో భ్రష్టు పట్టించారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ స్థాయి అధికారి ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ టి.గాయత్రి అధ్యక్షతన రాష్ట్ర విద్యాశాఖ సరఫరా చేసిన నోట్‌బుక్స్, బ్యాగ్‌లను 105 మంది విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. ఎంఈవో వెంకటేశ్వరరావు, రోజ్‌లాండ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సాగునీరు అందించాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల రూరల్, జూలై 27 : బాపట్ల నియోజకవర్గంలో ఉన్న పంటకాల్వలు, పీటీ చానల్‌లను వెడల్పు చేసి, మరమ్మతులు ఉన్నచోట వెంటనే అధికారులు మరమ్మతు పనులను పూర్తి చేసి రైతులకు సరైన సమయంలో సాగునీరు అందించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామంలోని నరసాయపాలెం లాకులను, జమ్ములపాలెం, కంకటపాలెం గ్రామాలలోని పంటకాల్వలను, పీటీ చానల్‌లను ఇరిగేషన్ అధికారులతో శనివారం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల మండలంలో సుమారుగా 20 వేల ఎకరాలలో రైతులు పంటసాగు చేసుకున్నారు. వారికి సాగునీరు అందించే విషయంలో ఆలస్యం చేయరాదని అధికారులకు సూచనలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంటకాల్వ కట్టలను సైతం కొట్టి మట్టిని తవ్వేసుకున్నారన్నారు. బలహీనంగా ఉన్న కాల్వ కట్టలను అధికారులు గుర్తించి వెంటనే వాటిని పునరుద్ధరించుకోవాలని తెలిపారు. రైతులు, అధికారులు పంట పొలాల సమీపంలో ఉన్న కాల్వకట్టల మీద మామిడి మొక్కలను నాటాలని తద్వారా వచ్చే ఆదాయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలలోని రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలపగా వెంటనే వాటి పరిష్కారానికి ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు, ఇరిగేషన్‌శాఖాధికారులు పాల్గొన్నారు.

పీటీ ఛానల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, జూలై 27 : మండలంలోని పేరలి తిమ్మరాజు ఛానల్, లంక ఛానల్, ఇసుక ఛానల్, పేరలి ఛానల్, పేరలి కొత్తపాలెం వద్ద తమ్ములశాఖ ఛానల్‌లను ఎమ్మెల్యే నరేంద్రవర్మ టీడీపీ శ్రేణులు, అధికారులతో కలిసి సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తీరప్రాంత గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, పిట్ల వసంతరెడ్డి, డీ రామమూర్తి, ఏఈ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, బోయన వెంకటేశ్వర్లు, బుల్లియ్య, నామన వెంకట శివన్నారాయణ, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్ర, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నరసాయపాలెం లాక్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, అధికారులు

నేడు పంట కాల్వలు పరిశీలించనున్న ఎమ్మెల్యే

పిట్టలానిపాలెం, జూలై 27 : మండలంలో ఇరిగేషన్ శాఖాధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మండలంలో పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షులు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు సంయుక్తంగా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత మండలంలోని ఖాజీపాలెం గ్రామం నుంచి ప్రారంభమై పంట కాల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడుతారని, పిట్టలవానిపాలెం జలవనరుల శాఖలో గల లాక్‌లను పరిశీలించిన అనంతరం చందోలు నుంచి కోడూరు మార్గ మధ్యలో గల ఆరమండకాల్వను పరిశీలిస్తారని తెలిపారు. ఆదివారం 10.30కి చందోలు వద్ద గల బండ్లమ్మ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ప్రారంభించి రైతులకు పంటకాల్వ ద్వారా సాగునీటిని విడుదల చేస్తారని తెలిపారు.

విలువలకు నిలువెత్తు నిదర్శనం అబ్దుల్ కలాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు

బాపట్ల, జూలై 27 : క్షిపణి శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్‌కలాం దేశానికి అందించిన సేవలు నిరుపమానమైనవని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. అబ్దుల్‌కలాం 9వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ, జనసేన నాయకులతో కలిసి అబ్దుల్‌కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ విలువలకు నిలువెత్తు నిదర్శనం అబ్దుల్‌కలాం అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్, నాయకులు వేమవరపు విజయ్‌కుమార్, బ్రహ్మాండం బాలనారాయణ, ముప్పల శ్రీనివాసరావు, జంగం ప్రవీణ్, మందపాటి ఆంద్రేయ, భోగిరి రామారావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, తిరువీదుల శంకరప్రసాద్, మహిళా నాయకులు పల్లం సరోజనీ, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా పాల్గొన్నారు.

● ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి ఎంఈవో దేవరకొండ ప్రసాదరావు పుష్పాంజలి ఘటించారు. న్యాయవాదులు జమ్ముద్‌బాషా, టి.భాస్కరరావు, దోనేపూడి రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శణీయులని తెలుగుదేశం పార్టీనాయకులు అన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నివాసం వద్ద శనివారం అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పఠాన్ రాజేష్, తిరువీదుల శంకరప్రసాద్, పల్లం సరోజనీ, బాలమ్మ, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, దగ్గుమల్లి ధర్మారావు, పల్లం జీవన్, భోగిరి రామారావు, ప్రసాద్, రసూల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు.

● మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని బాపట్ల సీబీజెడ్ చర్చి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి యువతకు ఆయన చూపిన మార్గాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ కార్యదర్శి జె.క్రిష్టాఫర్, టి.ప్రేమచంద్, ఎం.పవిత్రకుమార్, డీఎమ్ రాహుల్‌దేవ్ పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జూలై 27 : మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పూలు సమర్పించి ఉద్యోగులు ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో జలజ, ఏపీఎం శ్రీమన్నారాయణ, సీసీలు రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

● కర్లపాలెం, జూలై 27 : కర్లపాలెంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ సలీమా పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు నాగరాజు, కుంచాల గోపిరెడ్డి, ఇనకొల్లు పోలీసురావు, యోహోషువా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, జూలై 27 : అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు అన్నం సాయివరప్రసాద్ అన్నారు. మాజీ రాష్ట్రపతి, సైంటిస్టు ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పి.సాంబశివరావు, బండారు రమేష్, ఎం.శ్రీనివాసరావు, పి.బాలకృష్ణ, హెచ్‌ఎం ఎంవీ జాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫామ్ ఆయిల్ పంట సాగుకి చుండూరు అనుకూలం

చుండూరు, జూలై 27 : జిల్లాలో ఫామ్ ఆయిల్ పంట సాగుకి చుండూరు మండల గ్రామాలు అనుకూలంగా ఉన్నాయని అజంతా సోయా లిమిటెడ్ టెక్నికల్ కన్సల్టెంట్ సుధాకరరెడ్డి తెలిపారు. మోదుకూరులో శనివారం ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఉద్యానవన శాఖలచే చేపట్టిన సర్వేలో చుండూరు మండల గ్రామాలు ఫామ్ ఆయిల్ పంట సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. జిల్లాలో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ స్థాపనకు, నర్సరీ మొక్కలు సరఫరాకు, అజంతా సోయా లిమిటెడ్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఈ సాగు ద్వారా ఎకరానికి రూ.1.30 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని, పంట సాగుకి కావాల్సిన అన్ని ఏర్పాట్లు అజంతా సంస్థ అందిస్తుందని సుధాకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ బాషా, బాలయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్వేతపత్రాల చర్చల్లో ఎందుకు పాల్గొనలేదు జగన్‌రెడ్డి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల

భట్టిప్రోలు, జూలై 27 : శ్వేతపత్రాలు అబద్ధపు పత్రాలుగా పోలుస్తూ హామీల అమలుపై ప్రజల దృష్టిని మళ్ళించేందుకు శ్వేతపత్రాల పేరుతో డ్రామాలాడుతున్నారంటూ జగన్‌రెడ్డి పేర్కొనడాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఖండించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల జగన్‌రెడ్డి అరాచక పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. మాటకు కట్టుబడి అవ్వతాతల పెన్షన్ రూ.3 వేలు నుంచి రూ.4 వేలకు పెంచి అమలు చేయడం, 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం, ఉచిత ఇసుక అమలు చేయడం హామీలు నెరవేర్చడం కాదా అంటూ సాయిబాబా ప్రశ్నించారు.

మండల గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

చుండూరు, జూలై 27 : మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టినట్లు, ఇది ఆగస్టు 10వ తేదీ వరకు కొనసాగుతుందని ఎంపీడీవో జి.అరుంధతిదేవి శనివారం తెలిపారు. మండల గ్రామాల్లో దీనికి సంబంధించిన సమస్యలు ఎదుర్కొంటున్న వారు మండల కమాండ్ కంట్రోల్ టీం సెల్ నెంబర్లు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 9703609563కి సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు 9000449798 నెంబర్లకు సమాచారం అందించి సమస్యలు పరిష్కరించడానికి తోడ్పాటు అందించాలని కోరారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థికసాయం

అమృతలూరు, జూలై 27 : మండల కేంద్రం అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శనివారం దాత ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని తురుమెళ్లలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన క్రొత్తపల్లి కోటయ్య కుమారుడు ధర్మపత్ని అనంతమ్మల జ్ఞాపకార్థం యలమంచి మనోరమ రూ.50 వేలను అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిరీక్షణరావుకు అందించారు.

ఈ సందర్భంగా దాతను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, ఉపాధ్యాయులు దుర్భ భ్రమరసూర్యశ్రీ, మాచిరాజు శాంతి, అనూరాధ, మల్లంపాటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌వాటర్ చానల్‌కు గండి

● సమస్య పరిష్కరించాలని కోరినా పత్తాలేని అధికారులు

● తాత్కాలికంగా పూడ్చుకున్న రైతులు

రేపల్లె, జూలై 27: నియోజకవర్గంలోని నిజాంపట్నంలో గుడ్‌వాటర్ చానల్‌లో శుక్రవారం అర్ధరాత్రి గండిపడి చానల్‌లోని నీరంతా డ్రెయిన్‌లోకి పోయింది. దీంతో రైతులు పోసుకున్న నారుమళ్లకు సాగునీరు అందే పరిస్థితి లేదని, తక్షణమే జలవనరుల శాఖాధికారులు గండికి మరమ్మతులు నిర్వహించాలని ఆయా ప్రాంత రైతులు అధికారులకు విన్నవించారు. శనివారం 4గంటల వరకు గండికి మరమ్మతులు నిర్వహిస్తారని రైతులు ఎదురుచూశారు. జలవనరుల శాఖాధికారులు పట్టించుకోకపోవటంతో ఉన్న నీటినైనా కాపాడుకునేందుకు రైతులే స్వచ్ఛందంగా గండిని పూడ్చేపనిలో నిమగ్నమయ్యారు. తక్షణమే ఉన్నతాధికారులు దృష్టిసారించి పూర్తిగా మరమ్మతులు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ఈ చానల్ కింద 3వేల ఎకరాలు ఖరీఫ్‌సాగు చేస్తున్నామని, ఇప్పటికే కొంత పొలం వెదపెట్టగా, కొంత నారుమడులు పోసుకున్నామని, సాగునీరు అందకపోతే మొలకలు వచ్చిన నారు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు తెలుపుతున్నారు.


చానల్‌కు పడిన గండిని స్వచ్ఛందంగా పూడ్చుకుంటున్న రైతులు

కిశోరి బాలికలకు అవగాహన సదస్సు

కొల్లూరు, జూలై 27 : కిశోరి బాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేసుకోరాదని, తల్లిదండ్రులు బలవంతం పెట్టినా తమ దృష్టికి తీసుకువస్తే నిలువరిస్తామన్నారు. పైగా బాల్య వివాహాల వల్ల బాలికలు పలు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చావా ఉషాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు ధ్రువీకరణ పత్రాలకు భూయజమానులు సహకరించాలి

బాపట్ల, జూలై 27 : పంట సాగు ధ్రువీకరణ పత్రాల కొరకు భూయజమానులు కౌలు రైతులకు సహకరించే విధంగా చూడాలని దళిత బహుజన్ రీసోర్స్‌సెంటర్ నాయకులు శనివారం వినతిపత్రం ద్వారా జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణను కోరారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ భూయజమానులు నష్టపోకుండా పంట సాగుదారుల చట్టం 2019 ద్వారా ఎలాంటి నష్టం జరగకుండా చట్టంలో సవరణ చేసినందున భూయజమానులు కౌలు రైతులకు పత్రాలు ఇచ్చే విధంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ బి.రమణమూర్తి, రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్లు శ్రీలత, వి.భగవాన్‌దాసుపాల్గొన్నారు.

పంట కాల్వలకు సాగునీరు విడుదల

కొల్లూరు, జూలై 27 : కొల్లూరులోని రేపల్లె బ్యాంకు కెనాల్ నుండి రైతుల అవసరాల నిమిత్తం శనివారం టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ చిన్నకట్ట వద్ద రెండు స్లూయిజ్‌ల ద్వారా నీటిని విడుదల చేశారు. తొలుత శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పంట కాల్వలలోని తూటికాడ, గుర్రపుడెక్క తదితర వ్యర్థాలు తొలగించడంలో నిర్లక్ష్యం చేశారని, ఆయా కాంట్రాక్టులు పొందిన గుత్తేదారులు సైతం తుతూమంత్రంగా పనులు చేయడం వల్ల రైతులకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో కాల్వల్లో పూడికతీతలతో పాటు తూటికాడ, గుర్రపుడెక్క తదితర వ్యర్థాల తొలగింపు కోసం మందులు పిచికారీ చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు (బుజ్జి), గద్దె నాగేశ్వరరావు, కోగంటి సాంబశివరావు, మొలబంటి రామారావు, రైతులు సూర్యదేవర శ్రీనివాసరావు, సూర్యదేవర రాఘవేంద్రరావు, పసి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పంట కాల్వలకు సాగునీరు విడుదల చేసి పూలు జల్లుతున్న మురళీకృష్ణ

కుటుంబ సభ్యుల మీద బెంగతో వెళ్ళిపోయిన హాస్టల్ విద్యార్థి


విద్యార్థిని కుటుంబసభ్యులను విచారిస్తున్న ఆర్డీవో హేలా షారోన్

రేపల్లె, జూలై 27 : ఎస్సీ 2వ బాలికల హాస్టల్‌లో విద్యార్థినిని ఎవరో తీసుకుని వెళ్లారంటూ వచ్చిన ఆరోపణలో నిజం లేదంటూ సోషల్ వెల్ఫేర్ డీడీ రాజదబేరా అన్నారు. ఎస్సీ 2వ వసతి గృహంలో విద్యను అభ్యసిస్తున్న 8వ తరగతి విద్యార్థి కె.సియోన్‌కుమారి కుటుంబసభ్యులపై బెంగతో శుక్రవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఎవరికి చెప్పాపెట్టకుండా హాస్టల్ నుంచి వెళ్ళిపోయింది. విషయం తెలుసుకున్న హాస్టల్‌లో ఉన్న కమాటి లక్ష్మీ బాలిక కనిపించటం లేదంటూ వార్డెన్ లక్ష్మీప్రసన్నకు తెలిపింది. వెంటనే అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ కె.సత్యన్నారాయణకు విషయం తెలపటంతో గాలింపు చర్యలు చేపట్టారు. హాస్టల్ నుంచి విద్యార్థిని నడుచుకుంటూ పెనుమూడి వరకు వెళ్ళి అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై వెళ్ళి దుగ్గిరాల మండలం పెదకొండూరులో దిగింది. ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో చుట్టుప్రక్కల వారు విద్యార్థినిని గమనించి పోలీసులకు అప్పగించటంతో కుటుంబ సభ్యులకు తెలియజేసి అమ్మాయిని అప్పజెప్పటంతో శనివారం హాస్టల్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో, సోషల్ వెల్ఫేర్ డిడి రాజదుబేరా, పట్టణ సీఐ నజీర్‌బేగ్ విచారణ చేపట్టి విద్యార్థిని అడిగి వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యులపై బెంగతో వెళ్ళానని, తనను ఎవరూ తీసుకుని వెళ్ళలేదని, ఆరోగ్యం బాగోకపోవటంతోనే వెళ్ళానని తెలిపింది. దీంతో అధికారులు విద్యార్థినిని సున్నితంగా మందలించి వార్డెన్ లక్ష్మీప్రసన్నను, కమాటి లక్ష్మీని ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కారాదు

● కాలేజీ ఎడ్యుకేషనల్ కమిషనర్ పోలా భాస్కర్

రేపల్లె, జూలై 27 : విద్యార్థులు ప్రస్తుత తరుణంలో సెల్‌ఫోన్‌లకు బానిసలై విద్యను పక్కన పెడుతున్నారని అలా చేస్తే భవిష్యత్తు కుంటుపడేపరిస్థితి నెలకొందని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాలేజీ ఎడ్యుకేషనల్ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. అనగాని భగవంతరావు డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్నెల్ ఎస్ఎస్‌మెంట్ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఏ ప్లస్ గ్రేడ్ సాధించటం అభినందనీయమన్నారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల సేవలను ఆయన దృష్టికితేవటంతో అభినందించారు. కళాశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న పోలా భాస్కర్

డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపు

రేపల్లె, జూలై 27 : ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్‌లు తూటికాడ, గుర్రడెక్కతో నిండిపోయి ఉండటంతో వర్షం పడితే నీరుపారుదలయ్యే పరిస్థితి లేదు. డ్రెయినేజీ అధికారులు మాత్రం నిధులు మంజూరయ్యాయని టెండర్లు పిలుస్తున్నామని, ఎక్కడా కూడా పూడికతీత పనులు చేసిన దాఖలాలు లేవు. దీంతో నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్‌లో ఆయా పొలాల పరిధిలోని రైతులు స్వచ్ఛందంగా నగదును పోగుచేసుకుని తూటికాడ, గుర్రపుడెక్కను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. నగరం మండలం పూడివాడలోని ఈదుపల్లి ఛానల్‌లో మాజీ సర్పంచ్ కాసాని శ్రీనివాసరావు ఎక్స్‌కవేటర్‌తో గుర్రపుడెక్క, తూటికాడ శనివారం తొలగించారు. ఇప్పటికైనా డ్రైనేజీ అధికారులు దృష్టిసారించి నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్‌లో పూడికలు తీయాలని రైతులు వేడుకుంటున్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి : బీజేపీ

రేపల్లె, జూలై 27 : సముద్రతీర ప్రాంతంలోని ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సచివాలయంలోని ఎక్సైజ్ శాఖమంత్రి కొల్లురవీంద్రకు బీజేపీ నాయకులు విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు డీజిల్ ఆయిల్ రూ.9లుకు ఇస్తున్న సబ్సిడీని రూ.15లకు పెంచాలని కోరారు. విద్యుత్‌ను యూనిట్ రూ.1.50 పైసలకు ఆక్వా రైతులకు అందించాలని కోరారు. తీరప్రాంతంలోని వైద్యశాలను మెరుగుపర్చాలని, వ్యవసాయ రంగంలోని మినుము, పెసర, వేరుశనగ, మొక్కజొన్న, ఎరువులు ప్రభుత్వ ధరలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

రేపల్లె, జూలై 27 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. నిజాంపట్నంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో వసతి గదులు, మరుగుదొడ్లు, ఆహార పదార్థాలను శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులను అడిగి గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత లోపభూయిష్టంగా ఉందని మరుగుదొడ్లలో శుభ్రత లేదని, ఆహార పదార్థాల్లో కొంతమేర నాణ్యత లోపించిందని, తక్షణమే అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేశారు. గురుకుల పాఠశాలల్లోని సమస్యలను రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కర్లపాలెం, జూలై 27 : వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ బిడారుదిబ్బలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అనీల్‌కుమార్ కథనం మేరకు బిడారుదిబ్బలో కుక్కల శ్రీనివాసరెడ్డి, సీత దంపతులు కూరగాయల దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో శ్రీనివాసరెడ్డి నిత్యం మద్యం సేవిస్తూ భార్య పట్ల ఇబ్బందికరంగా వ్యవహరిస్తూ ఉండటంతో భర్తపెట్టే ఇబ్బందులకు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్సై వివరించారు. మృతురాలు తల్లి శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



అక్రమ కట్టడం కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ కట్టడం కూల్చివేత

- వైసీపీ హయాంలో కాంప్లెక్స్ నిర్మించిన ఆ పార్టీ నేత
- నోటీసుకు స్పందించక పోవడంతో రంగంలోకి అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 27: వైసీపీ హయాంలో ఆ పార్టీ నేత అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిర్మించిన ఓ అక్రమ కట్టడంపై అధికారులు కొరడా ఝులిపించారు. మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు అన్న క్యాంటీన్ పక్కన ఓ వైసీపీ నాయకుడు గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా దుకాణాల సముదాయాన్ని నిర్మించాడు. ఇవి అక్రమ నిర్మాణాలు తేల్చిన మున్సిపల్ అధికారులు శనివారం కూల్చివేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత అనుచరుడైన దేవేళ్ల సుబ్బారావు అనే వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి అన్నా క్యాంటీన్ ఎదురు ఉన్న ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టాడు. సర్వే నెంబర్ 494-బీ4లోని ఆ స్థలంలో క్రిస్టియన్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలోని ఆంగ్లేయుల కాలం నుంచి ఒక బావి ఉండేది. ఆంగ్లేయ అధికారులు ఈ బావి ద్వారా నీటిని తోడి ఎదురుగా ఉన్న ఏబీఎం కాంపౌండ్‌లోని దొరనివాసం వెనుక పొలాలకు నీరు పెట్టి పంటలు పండించేవారు.

ఆంగ్లేయులు దేశం విడిచి వెళ్లిపోయిన తర్వాత ఈ అతిపెద్ద బావి కాలక్రమేనా వినియోగం లేకుండా పోయింది. ఆ తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. దీంతో ఈ వైపు ఉన్న స్థలాలకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. ఈ బావిపై కన్నేసిన వైసీపీ ముఖ్య నాయకుడి అనుచరుడు బావిని పూడ్చి వేశాడు. మున్సిపల్ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టాడు. దీనికి తోడు తప్పుడు పత్రాలు సృష్టించి నిర్మాణం చేపడుతుండగా అప్పట్లో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు అడ్డుపడ్డారు. ధర్నాలు చేసి ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేసినా అధికారాన్ని అడ్డుపెట్టుకొని యథేచ్ఛగా అక్రమ నిర్మాణాన్ని కొనసాగించాడు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన వాణిజ్య సముదాయానికి విద్యుత్ మీటర్లు అమర్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణంలోని ఆక్రమణలపై దృష్టి సారించింది. ఆక్రమణదారుడికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించ లేదు. దీంతో అధికారులు కట్టడాలను కూల్చివేశారు. పట్టణంలో అక్రమంగా ప్రభుత్వ భూములలో ఉన్న కట్టడాలు తొలగిస్తామన్నారు. ఇటువంటి అనుమతులు లేని భవనాలను తొలగిస్తామని కమిషనర్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ షేక్ సుభానీ, ఏఈ ఆదినారాయణ, పట్టణ ప్రణాళిక అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ప్రతాప్‌రెడ్డి?

ఒంగోలు(క్రైం), జూలై 27: ఒంగోలుకు చెందిన వైసీపీ యువనేత అనుచరుడు ఎట్టకేలకు పోలీసులకు దొరికాడు. ఇటీవల ఒంగోలులో స్పా సెంటర్లపై పోలీసులు చేసిన రైడింగ్‌లో మహిళతో మసాజ్ చేయించుకుంటూ వైసీపీ నాయకుడు యం.ప్రతాప్‌రెడ్డి పట్టుబడ్డాడు. అయితే పోలీసు స్టేషన్‌కు తరలించేలోపే ఓ హెడ్ కానిస్టేబుల్‌పై దౌర్జనం చేసి పరారయ్యాడు. దీంతో అప్పటి నుంచి ప్రత్యేక బృందం ప్రతాప్‌రెడ్డి కోసం గాలిస్తున్నారు. శనివారం ప్రతాప్‌రెడ్డిని తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఓ పోలీసు అధికారే అతనిని రైడింగ్ సమయంలో తప్పించినట్లు ప్రచారం నడుస్తోంది.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

చీరాలటౌన్, జూలై 27: ప్రకాశం జిల్లా కందుకూరు మండల కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ తేళ్ల కిషోర్ (52) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. అతని భార్య సుకన్య, ఇద్దరు బాలురు సంతానం. అయితే యథావిధిగా శుక్రవారం విధులు ముగించుకుని స్వగ్రామమైన చీరాల మండలం విజయనగర్ కాలనీ ఇంట్లో పడుకున్నారు. తెల్లవారుజామున ఊపిరి అందక అవస్థ పడుతుండడంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆ సమయంలో హాస్పిటల్ వైద్యులు పరీక్షలు చేసి చికిత్స ప్రారంభించేలోపు కిషోర్ తుదిశ్వాస విడిచారు. ఈక్రమంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కొద్దిసేపు మృతుని బంధవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసమయంలో కొద్దిసేపు హాస్పిటల్ వద్ద ఆందోళన వాతావరణం నెలకొంది. ఉన్నతధికారుల చొరవతో అక్కడనుంచి వెళ్లిపోయారు.

కుంకలమర్రు సర్పంచ్, కార్యదర్శిపై విచారణ

కుంకలమర్రు (పర్చూరు), జూలై 27 : నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ నిధులు డ్రా చేశారని కారంచేడు మండలంలోని కుంకలమర్రు గ్రామ సర్పంచ్, కార్యదర్శిలపై గ్రామస్థులు చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి కె.అంజయ్యతోపాటు, సర్పంచ్ కూడా అవకతవకలకు పాల్పడ్డారని గ్రామస్థులు ఫిర్యాదును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ద్వారా కలెక్టర్‌కు అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంకటమురళి జిల్లా పంచాయతీ అధికారిని విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చీరాల డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణ అధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 5వ తేదీలోపు విచారణను పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

పర్చూరు, జూలై 27: కారంచేడు మండలం తిమిడితిపాడు - స్వర్ణ రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన ఈదర శ్రీనివాసరెడ్డి (56) మృతి చెందారు. చీరాల నుంచి తిమిడితిపాడు మీదుగా స్వగ్రామం వంకాయలపాడు ద్విచక్రవాహనం వెళ్తుండగా గేదె అడ్డు రావడంతో ఢీకొట్టి పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. అతనిని చీరాల ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాసరెడ్డి ఇంకొల్లు మండలం కొణికి ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. అతనికి భార్య ఉన్నారు.

తిరుమలకు పాదయాత్ర

పీసీపల్లి, జూలై 27: గుంటూరులో పత్తి వ్యాపారంతో పాటు ముఠా పనులు చేసుకుంటున్న పీసీపల్లి మండలం గుదేవారిపాలెంకు చెందిన పలువురు తిరుమలకు కాలినడకన బయలుదేరారు. కనిగిరి ఎమ్మెల్యేగా ఉగ్రనరసింహారెడ్డి విజయం సాధించడంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలినడకన తిరుమలకు వస్తామని ఎన్నికలకు ముందు వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. మొక్కు చెల్లించుకునేందుకు గుంటూరు నుంచి కాలినడకన బయలుదేరిన టీడీపీ శ్రేణులు శనివారం శింగరాయకొండకు చేరుకున్నారు. వీరితో పాటు మరోబృందం శనివారం మండలంలోని గుదేవారిపాలెం నుంచి పాలేటిగంగ, అగ్రహారం మీదుగా కాలినడకన శింగరాయకొండకు చేరుకున్నారు. అక్కడ నుంచి అందరూ కలిసి కాలినడకయాత్ర సాగించారు. తిరుమలకు బయలుదేరిన శ్రేణులకు టీడీపీ మండల నాయకులు వీరపనేని పెద్దన్న, షవ్వాడి నాగరాజు, ములకా నాగేశ్వరరావు, నానిబాబు, గుదేవారిపాలెం సర్పంచ్ శాంసన్‌లు అవసరమైన వస్తువులను అందజేశారు.

నాన్నకు ప్రేమతో..!



- బాధ్యతగా భవిష్యత్ చూపారు.. ఐఏఎస్ లక్ష్యం నిర్ణయించారు
- ఆపై అన్నీతానై నడిపించారు
- ప్రజలకు సేవచేయడం ఇష్టం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నాన్న సూచించే భవిష్యత్తు మార్గాలు ఎవరికైనా కీలకమే. భవిష్యత్తు మార్గాలను చూపటమే కాక తదనుగుణంగా పిల్లలను ప్రోత్సహించటం నాన్న బాధ్యత. వాటిని అందిపుచ్చుకొని పెద్దల ఆశయాలను నెరవేరుస్తూ తమ జీవితాన్ని బంగారుబాటగా రూపొందించుకోవటం బిడ్డ కర్తవ్యం. అటు తండ్రి ఇటు పిల్లలు సమష్టిగా ముందడుగు వేసి విజయం సాధించిన ఘటనలు అరుదుగా కనిపిస్తాయి. అలాంటి అరుదైన ఉదంతానికి మన కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఆమె తండ్రి అబ్దుల్లా పాత్రలు దర్పణం పడుతున్నాయి. పిల్లల లక్ష్యసాధన విషయంలో తండ్రి సరైన పాత్ర పోషిస్తే వారు అతని మాటకు, భావాలకు అనుగుణంగా ముందుకుసాగి ఘనమైన విజయాన్ని తమ జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుంటారనేందుకు తమీమే ఒక చక్కని ఉదాహరణ..

3వ తరగతిలోనే ఐఏఎస్ కల

తమీమ్ అన్సారియా 3వతరగతి చదివే రోజుల్లోనే ఐఏఎస్ కావాలని బీజం పడింది. అప్పటికీ ఆ చిన్నారికి ఐఏఎస్ అంటే ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ అని కూడా తెలియదు. కానీ చిల్డ్రన్స్‌డే సందర్భంగా మీరు పెద్దయితే ఏమవుతారో తెలుసుకుని రండి అని ముందుగానే స్కూల్ టీచర్ తెలిపారు. పాఠశాలకు బయలుదేరే సమయంలో అన్సారియా తన తండ్రిని డాడీ ఏం చెప్పాలని అడిగారు. ఆయన సమాధానం విని ఆమె ఎగురుకుంటూ స్కూల్‌కి వెళ్లి తాను ఐఏఎస్ అవుతానంటూ చెప్పేసింది. ఆ తర్వాత తండ్రీకూతుళ్లలో ఆ హోదాపై మమకారం పెరిగింది. అన్సారియా ఇంజనీరింగ్ పూర్తిచేసిన సమయానికి తండ్రి ఐఏఎస్ అధికారుల పనితీరు, సమాజంలో ప్రజాసేవలో వారికుండే అవకాశాలు తెలిపి సివిల్స్ పట్ల ఆమెలో ఆసక్తిని పెంచారు. అందుకే 2010లో తాను ఇంజనీరింగ్ చేసిన అన్నా యూనివర్సిటీలో చేస్తున్న ఉద్యోగాన్ని, 2011లో తమిళనాడు సచివాలయంలో చేపట్టిన పోస్టును ఆమె వదిలేశారు. తండ్రి ఆశను నెరవేర్చాలనే ఏకైక లక్ష్యంతో 2013లో సివిల్స్ ప్రిపేర్ అయ్యారు. 2015లో లక్ష్యాన్ని సాధించారు. దీంతో అబ్దుల్లా ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అన్సారియా తాను ఐఏఎస్ అధికారి అయ్యేందుకు తండ్రి ఇచ్చిన స్ఫూర్తిని, ప్రోత్సాహాన్ని మననం చేసుకున్నారు.

జీవిత భాగస్వామిని వారే ఎంపిక చేశారు

ఉన్నత విద్యాభ్యాసం చేసినా ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్నా వ్యక్తిగత జీవిత విషయాల్లో కూడా పెద్దల మాటకే ప్రాధాన్యత ఇచ్చారు. వివాహమనే కీలక నిర్ణయంలో కూడా తల్లిదండ్రుల ఆలోచనకు అనుగుణంగా నడిచారు. తండ్రి సూచించిన హర్యానాకు చెందిన మరో ఐఏఎస్ అధికారి డాక్టర్ మంజిల్ జిలానీ సామన్‌ను వివాహం చేసుకున్నారు. వైద్య విద్య పూర్తిచేసిన ఆయన తర్వాత ఐఏఎస్ అధికారి అయ్యారు. సామన్ కుటుంబసభ్యులు తమిళనాడులోని వేలూరులో వైద్యవృత్తిలో ఉన్నారు. వారి ద్వారా సామన్‌తో వివాహాన్ని తండ్రి నిశ్చయం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో కేడర్ అధికారులుగా ఉన్న ఇద్దరు 2020లో ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఇక్కడే అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చారు.

పట్టుదలతో తెలుగుభాష నేర్చుకున్నారు

ఏ రాష్ట్రంలో పనిచేస్తుంటే అక్కడి ప్రజలు మాట్లాడే భాషను నేర్చుకోవటం అనేది విధివిధానాల్లో ఒక భాగం. దానిని చక్కగా అనుసరించి అనర్గళంగా తెలుగు మాట్లాడటం, చదవటం అన్సారియా వంటబట్టించుకున్నారు. ప్రస్తుతం తెలుగు లేఖలను ఆమె సులువుగా చదవగలుగుతున్నారు. అంతకన్నా సులువుగా మాటను అర్థం చేసుకోవటమే కాక మాట్లాడటంలో రాణించారు. తెలుగును అంత సులువుగా నేర్చుకునేందుకు అన్సారియా పెద్ద ప్రయత్నమే చేశారు. తెలుగు సినిమాలు చూడటం, సంగీతాన్ని వినటం ద్వారా ఆమె భాష విషయంలో విజయం సాధించారు.

నిర్దిష్ట లక్ష్యంతో ముందడుగు

తండ్రి చెప్పినట్లు ఐఏఎస్ సాధించటమే కాక ఒక అధికారిగా ప్రజలకు ఎలాంటి సేవ చేయాలనే విషయంలో నిర్దిష్టమైన విధానాన్ని ఎంచుకున్నారు. పదిమందికి సేవ చేసి సంతృప్తి చెందాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నట్లు అన్సారియా చెప్పారు. జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన కొద్దిరోజుల్లోనే అనేక విషయాల్లో సంతృప్తికరమైన నిర్ణయాలు తీసుకోగలిగానని ఆనందంగా చెబుతున్నారు. కాగా భర్త చనిపోయి ప్రభుత్వపరంగా అందాల్సిన సహకారం అందక ఏళ్లతరబడి ఇబ్బందుల్లో ఉన్న ఒక మహిళ ఇటీవల కలెక్టర్‌ను కలిశారు. సంబంధిత అధికారులందరినీ అప్రమత్తం చేసి ఆమె సమస్యకు వారంరోజుల్లోనే పరిష్కారం చూపారు. ఒక విద్యా సంస్థ నుంచి మరోచోటకు మారి తన సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందిపడుతున్న ఒక విద్యార్థి కూడా అన్సారియాను కలిశాడు. అప్పటికప్పుడు ఆ విద్యాసంస్థ యాజమాన్యంతో మాట్లాడి సదరు విద్యార్థి సమస్య పరిష్కరించారు. అందుకే కాబోలు తన వద్దకు వచ్చిన ప్రతి మనిషి సమస్య ప్రభుత్వ పరిధిలో ఉంటే రోజుల్లోనే పరిష్కరించాలని ఆమె నిర్ణయించుకున్నారు.

చివరి వరకు ఇలాగే ఉంటా..

మా తండ్రి చిరువ్యాపారి. కష్టపడి మమల్ని చదివించి ఉన్నంతలో ఎలా సంతృప్తిగా జీవించాలో నేర్పించారు. ఇప్పుడు నేను నా భర్త కూడా ప్రభుత్వ ఉద్యోగులమే. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉంటే మరింత జీతం రావచ్చు. కానీ ఆనందం ఉండదు. ఐఏఎస్ అధికారిగా సమాజానికి సేవ చేస్తూ ఆదాయం కన్నా అధికమైన ఆత్మసంతృప్తి పొందగలుగుతున్నా. నాకు నా భర్తకు వచ్చే జీతం మాకు సరిపోతుంది. సమాజానికి సేవచేయటం ద్వారా మరింత సంతృప్తి చెందటమే మా లక్ష్యం. అందుకే చివరి వరకు ఇలాగే కొనసాగుతా.. అంటూ కలెక్టర్ అన్సారియా ఆంధ్రజ్యోతి ప్రతినిధితో తన భావాన్ని వ్యక్తం చేశారు.

పుట్టింది పెరిగింది చెన్నైలోనే..

కలెక్టర్ తమీమ్ అన్సారియా పట్టింది, పెరిగింది, విద్యాభ్యాసం చేసింది అంతా తమిళనాడు రాజధాని అయిన చెన్నైలోనే. ప్రఖ్యాతిగాంచిన అన్నామలై యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చేసి అక్కడే ఉద్యోగం చేశారు. ఆ తర్వాత మరింత జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా వదులుకున్నారు. 2011లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాసి గ్రేడ్-3 ఉద్యోగం సాధించారు. తమిళనాడు సచివాలయంలో ఉద్యోగంలో చేరారు. సొంతూరులో మంచి ఉద్యోగం వచ్చినా తండ్రి చెప్పిన ఐఏఎస్ కాలేదనే వెలితి ఆమెను వెంటాడింది. దీంతో 2013లో సివిల్స్ వైపు దృష్టిసారించారు. 2015లో ఐఏఎస్‌కు ఎంపికై ఉత్తరప్రదేశ్‌లో ఉద్యోగం పొందారు. ఆ తర్వాత 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సమూల్‌తో వివాహమైంది. ఉత్తరప్రదేశ్‌లో పనిచేస్తున్న ఇద్దరు 2020లో ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ అయ్యారు. విశాఖ అదనపు కమిషనర్‌గా, ఆ తర్వాత శ్రీశైలం ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అన్సారియా గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడే ఆమె భర్త కలెక్టర్‌గా ఉన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత అన్సారియాకు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వం ఆమె భర్త చేరువలో ఉండే విధంగా మార్క్‌ఫెడ్ ఎండీ, శ్యాప్ సీఈవో అధికారిగా నియమించింది.

తక్షణమే బిల్లులు చెల్లించాలి

- గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇసుకనూ సరఫరా చేయాలి
- అధికారులకు మంత్రి స్వామి ఆదేశం
- సచివాలయ వ్యవస్థపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి



గృహ నిర్మాణ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

తూర్పునాయుడుపాలెం (టంగుటూరు) జూలై 27: గృహ నిర్మాణాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆశాఖ అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సిమెంటును కూడా తక్షణమే సరఫరా చేయాలన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణ శాఖ, గ్రామ సచివాలయాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రూ.50 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి 2014-2019 కాలంలో నిర్మించుకున్న ఇళ్లకు కూడా వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిలిపివేసిందన్నారు. వాటిని త్వరిగతిన చెల్లించేలా చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు.

గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష సందర్భంగా మంత్రి స్వామి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ.. తమపై అజమాయిషీ చేసేది మాతృశాఖలు కాగా, జీతాలు ఇచ్చేది పంచాయతీ కార్యదర్శులని వివరించారు. తమను పూర్తిస్థాయిలో మాతృశాఖలకు అనుసంధానం చేసి జూనియర్ అసిస్టెంట్ పేస్కేలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ, వార్డు, సచివాలయ వలంటీర్ల వ్యవస్థపై త్వరలో కమిటీ వేసి అధ్యయనం చేస్తామన్నారు. ఆ కమిటీ నివేదిక అనంతరం విధివిధానాలు రూపొందిస్తామన్నారు. వచ్చే నెల పింఛన్ల పంపిణీ ఉదయం 6గంటలకే ప్రారంభించి 10గంటలలోపు పూర్తి చేయాలని మంత్రి గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్ పార్టీలో చేరిక



గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీలు

దర్శి, జూలై 27: టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముండ్లమూరు మండలంలో ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు, ఒక సర్పంచ్ శనివారం టీడీపీలో చేరారు. గొట్టిపాటి లక్ష్మి సమక్షంలో ముండ్లమూరు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు, ఉమామహేశ్వరపురం అగ్రహారం ఎంపీటీసీ వేముల పద్మ, నూజెండ్లపల్లి ఎంపీటీసీ తేలుకుంట్ల బ్రహ్మం, పసుపుగల్లు ఎంపీటీసీ దాసరి పెద్దఅంజయ్య, పూరిమిట్ల ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు, పులిపాడు ఎంపీటీసీ డి.తులసీభాయ్, భీమవరం ఎంపీటీసీ కీర్తిపాటి పూర్ణచంద్రరావు, పసుపుగల్లు సర్పంచ్ వరగాని బాలసుందరరావు, పులిపాడు తండా మాజీ సర్పంచ్ రామానాయక్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. డాక్టర్ లక్ష్మి వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వీరితోపాటు మరో 30మంది వైసీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీలో చేరటం శుభపరిణామమన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యం లోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందనే విశ్వాసంతో టీడీపీలో చేరినట్లు వైసీపీ ఎంపీటీసీలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులుడాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్, ఆపార్టీ ముండ్లమూరు మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, తాళ్ళూరు మండల అధ్యక్షుడు బొమ్మి రెడ్డి ఓబుల్‌రెడ్డి, బిజ్జం సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాస రావు, వరగాని పౌలు, కె.నాగరాజు, బేతపూడి రామారావు, నిడమానూరి శ్రీనివాసరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి భారీ షాక్

ముండ్లమూరు, జూలై 27: ముండ్లమూరు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆపార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు శనివారం సాయంత్రం టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలితసాగర్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. వీరు కాకుండా పసుపుగల్లు సర్పంచ్ వరగాని బాలసుందరరావు, పులిపాడు మాజీ సర్పంచ్ వడితే రామానాయక్, రిటైర్డు ఎంఈవో రామ్‌సింగ్, తమ అనుచరులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఆయన అనుచరులు కంగుతిన్నారు. మండలంలో మొత్తం 16 ఎంపీటీసీలు ఉండగా వైసీపీకి 11 స్థానాలు గెలుచుకొని ఎంపీపీ పదవిని కైవసం చేసుకుంది. టీడీపీ నాలుగు స్థానాల్లో, బీజేపీ ఒక స్థానంలో గెలిచింది. దీంతో మండల అధ్యక్ష పదవితో పాటు రెండు ఉపాధ్యక్ష పదవులు వైసీపీ వశమయ్యాయి. టీడీపీలోకి ఎంపీటీసీలు రావటానికి మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువ నాయకుడు కీలకంగా వ్యవహరించారు.

దెబ్బతిన్న రోడ్డు

- స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి
- వెంటనే బాగుచేయాలని అధికారులకు ఆదేశం

పర్చూరు, జూలై 27: పర్చూరు మండల పరిధిలోని బోడవాడ - రమణాయపాలెం ప్రధాన రహదారి సైడ్ బర్మ్ సరిగ్గా లేకపోవడంతో రోడ్డు కోతకు గురై పూర్తిగా దెబ్బతిన్నది. చిన్నపాటి వర్షాలకు సైతం రోడ్డు అంచులు కుంగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనదారులు రోడ్డు మార్జిన్ వైపు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతామని పంచాయతీరాజ్ శాఖ ఈఈ ఎమ్మెల్యేకి తెలిపారు.



బోడవాడ - రమణాయపాలెం మధ్య దెబ్బతిన్న రోడ్డు

బాలినేనిని కోర్టుకెక్కిస్తా!

- అతని అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు
- టీడీపీ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి హెచ్చరిక

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 27: వైసీపీ ప్రభుత్వం హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అవినీతికి పాల్పడటంతోపాటు అక్రమాలు చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై సీబీఐకి ఫిర్యాదు చేయడంతోపాటు, కోర్టుకెక్కిస్తానని తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అరాచక పాలనలో తామేమీ తక్కువకాదంటూ బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డి చేసిన అరాచకాలపై తాను న్యాయపోరాటం చేస్తానన్నారు. వారిని కోర్టు మెట్లు ఎక్కేలా చేస్తానని పేర్కొన్నారు. దీనిపై తాను స్వయంగా సీబీఐకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల ఒంగోలు వచ్చిన ఆయన కనీసం వైసీపీ కార్యకర్తలను కూడా కలవకుండా హడావుడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి నోటికొచ్చినట్లు టీడీపీ నేతలపై విమర్శలు చేసి వెళ్లిపోయారన్నారు. బాలినేని అవినీతికి పాల్పడకపోతే తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. చీమకుర్తి ప్రాంతంలో సర్వే నెం 55/3లో గ్రానైట్ వ్యాపారి శిద్దా హనుమంతరావు నుంచి 12 ఎకరాలు బలవంతంగా లీజుకు రాపించుకుని అక్రమాలకు పాల్పడలేదా? అని ప్రశ్నించారు. అదేవిధంగా సర్వే నెం. 55/3లో 39 ఎకరాల స్థలాన్ని బాలినేని బినామీలకే ఇప్పించి గత ఐదు సంవత్సరాలలో రూ.15 కోట్లు అవినీతి సొమ్మును కాజేశారని ఆరోపించారు. గ్రానైట్ క్వారీలలో అక్రమంగా మైనింగ్ చేపించి, ఈసీ, ఎన్‌ఓసీలు కూడా లేకుండా, కనీసం మైనింగ్ పర్మిట్లు కూడా లేకుండా అక్రమంగా రాళ్లను పోర్టుకు చేర్చిన ఘనుడు బాలినేని అన్నారు. ఎంతో సౌమ్యులైన ఆర్యవైశ్యులపై బాలినేని అనుచిత వాఖ్యలు చేసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. బాలినేని దర్జాగా తిరిగే టయోటా వెల్‌ఫేర్ కారు కమలాపురం రఘురెడ్డి ద్వారా అంజనేయులు అనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ దగ్గర కప్పంగా స్వీకరించలేదా? అంటూ నిలదీశారు. తాను తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు బాలినేని సిద్ధంగా ఉండాలని పెద్దిరెడ్డి హెచ్చరించారు.

గుండ్లకమ్మ నదిలో ఇసుక మాఫియా



గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లుగా ఉన్న ఆనవాళ్లు

- ఇష్టారాజ్యంగా రాత్రి సమయాల్లో ఇసుక తరలింపు
- ఆ ప్రక్రియలో విభేదాలు .. ఘర్షణ
- మంత్రి గొట్టిపాటి ఆగ్రహం

అద్దంకి, జూలై 27 : గుండ్లకమ్మ నదిలో ఇసుక అక్రమ తవ్వకం.. తరలంపు యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వం మారినా ఇసుక మాఫియా ఆగడాలు మాత్రం ఆగలేదన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తులకు తోడు మరి కొంతమంది అదనంగా చేరి దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. అధికారులు సైతం మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి ఇరువైపులా, మంచినీటి పథకాల ఊటబావుల ప్రాంతాలలో ఇసుక తవ్వకాలు జరగకుండా మున్సిపల్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఇటీవల అద్దంకిలో జరిగిన సమీక్ష సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒకింత ఘాటుగా చెప్పారు. అయితే ఆ స్థాయిలో అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఇసుకాసురులు యథేచ్ఛగా తమ దందా సాగిస్తున్నారు. పగలు అంతా నిశ్శబ్దంగా ఉండి, చీకటి పడితే మాత్రం రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాలలో ఎక్కడ పడితే అక్కడ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. తిమ్మాయపాలెం సమీపంలోని ఇసుక డంప్‌లో నాణ్యమైన ఇసుక లేకపోవడంతో గుండ్లకమ్మ నదిలో ఇసుక పైనే నిర్మాణదారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఇసుకాసురులు రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నారు. ఇసుక ధర తగ్గినా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడకపోవడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు పొంచి ఉంటాయనే ఆందోళన నెలకొంది. ఇప్పటికే బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరిగి పెద్ద గోయ్యిలు ఏర్పడ్డాయి. భారీ వర్షాలు పడి వరద వస్తే కోతకు గురై బ్రిడ్జి ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంటుందని పలువురు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరి ఉన్న బ్రిడ్జికి ముప్పు వాటిల్లితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఆందోళన ప్రజలలో ఉంది. ఇక ఊటబావుల ప్రాంతంలో కూడా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో ఊట నీరు లభ్యత తగ్గిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఇసుక మాఫియా మధ్య ఘర్షణ

ఇసుక తరలింపును గతంలో ఉన్న కొంత మంది రవాణాదారులతో పాటు కొత్తగా కొంత మంది రంగంలోకి వచ్చి రాత్రి సమయాలలో తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక తరలింపుపై తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తిమ్మాయపాలెంకు చెందిన ఇసుక రవాణాదారులు, అద్దంకి పట్టణంలోని కొంత మంది ఇసుక రవాణాదారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆయుధాలతో దాడి కూడా చేసుకున్నట్లు తెలుస్తుంది. ఆధిపత్య పోరు నేపథ్యంలోనే ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం మంత్రి రవికుమార్ దృష్టికి కూడా చేరడంతో అధికారులు, నాయకులకు చీవాట్లు కూడా పెట్టినట్లు తెలుస్తుంది. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించకుండా బ్రిడ్జి, ఊటబావుల ప్రాంతంలో ఇసుక రవాణా జరగకుండా చేయాలని అధికారులకు తెలిపినట్లు తెలుస్తుంది. ఆరంభంలోనే అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు తలెత్తె అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



వార్డులో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి

అద్దంకి, జూలై 27 : తాగునీటి సమస్య పరిష్కారంపై వెంటనే దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. అద్దంకి పట్టణంలోని 17వ వార్డులో శనివారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. తాగునీటి సమస్య, మురుగు కాలువలు, సైడ్ డ్రైన్‌ల సమస్యలను స్థానికులు వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేతలు షేక్ సైదావలి, సలీమ్, నవాజ్ షరీఫ్, మదీనా ఉన్నారు.

రామయ్యకు సన్మానం



రామయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ అన్సారియా

అద్దంకిటౌన్, జూలై 27 : కార్గిల్ విజయ్ దివస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలలో భాగంగా ప్రకాశం జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో పలువురు ఉద్యోగులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అద్దంకికి చెందిన దామా వెంకట రామయ్యను కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రజనీకుమారి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పందనా సేవా సమితి అధ్యక్షుడు కూకట్ల సుబ్బారావుతో పాటు పలువురు రామయ్యకు అభినందనలు తెలియజేశారు.

టోల్‌ప్లాజా ఉద్యోగులకు బెదిరింపులు

మార్టూరు, జూలై 27 : మండలంలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజాలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు తమ వేతనాలను పెంచాలని, కంపెనీ పరిధిలోకి తమను తీసుకోవాలని, బోనస్ ఇవ్వాలని, క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై గత ఐదు రోజులుగా నిరసన తెలిపారు. ఆందోళన కార్యక్రమాలు విరమించాలని మేనేజర్ శ్రీమన్నారాయణ బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని సీఐటీయూ నాయకులు శనివారం ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికైనా టోల్‌ప్లాజా మేనేజ్‌మెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

బల్లికురవ. జూలై 27 : బల్లికురవ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యద్దనపూడి శ్రీనివాసరావు ఈనెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తుండడంతో శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే సమాజాన్ని బాగు చేసేది అన్నారు. శ్రీనివాసరావు ఎంతోమందిని తీర్చిదిద్ది వారి మనస్సులలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతురావు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, పలు ఉపాధ్యాయ యూనియన్ల బాధ్యులు శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పంగులూరు, జూలై 27 : పర్యావరణ పరి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని డీఈవో గల్లా వెంకటేశ్వర్లు కోరారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తల్లీబిడ్డలతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం పంగులూరు, కొండమంజులూరు ఉన్నత పాఠశాలల్లో డీఈవో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించేలా తల్లిదండ్రులు చూడాలని డీఈవో సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నాగభూషణం, జి.వీరాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు కొప్పోలు రమాదేవి, ఇమ్మడిశెట్టి అనిత, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తల్లీబిడ్డతో మొక్క నాటిస్తున్న డీఈవో

మార్టూరు : మొక్కలను పెంచేందుకు అదరూ కృషి చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని చిమ్మిరిబండ హైస్కూల్లో శనివారం రోటరీక్లబ్, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో మాదాల సాంబ శివరావు, షేక్ కాజాహుస్సేన్, తాళ్లూరి సాంబ శివరావు, ఉపాధ్యాయులు కిషోర్ పాల్గొన్నారు.

చీరాలటౌన్ : పర్యావరణం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధను చూపాలని చీరాల మండలం ఎమ్‌ఈవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో అధికారులు మండల కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నా టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కాలుష్య తీవ్రతతో ప్రజలు అనారోగాలబారిన పడుతున్నట్లు వివరించారు. దీంతో భవిష్యత్ తరాలు ఘోరమైన ఫలితాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవోలు డీ గంగాధరరావు, బీ సుధాకరరావు అన్నారు. జాతీయ విద్య విధానం(ఎన్‌ఈపీ)-2020 వార్షికోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని తిమ్మాయపాలెం, బొమ్మనంపాడు గ్రామాల్లో మండల ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పర్యవరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు, పోషణ దినోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఏర్పాటు అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఐఈఈఆర్‌డీ సేవా సంస్థ అధ్యక్షుడు కిరణ్‌చంద్, హెచ్‌ఎంలు గంగాధరరావు, శ్రీనివాసమూర్తి, పురుషోత్తమ్మ, శ్రీనివాసరావు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు మొక్కలను దత్తతకు తీసుకుని పెంచి పోషించి వాటిని తల్లులకు అంకితం ఇవ్వాలని సమగ్ర శిక్ష బాపట్ల ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్ షేక్ సైదావలి అన్నారు. అద్దంకిలోని కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ సత్యసాగర్, ఎంఈవో సుధాకరరావు, ప్రిన్సిపాల్ దుర్గ గాయత్రి, సీఆర్పీ రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాజీ జవాన్ల భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

మాజీ జవాన్‌ల భూములు పరిశీలన

తోటవారిపాలెం(చీరాలటౌన్), జూలై 27 : చీరాల మండల పరిధిలోని తోటవారిపాలెంలో మాజీ జవానులకు కేటాయించిన భూములను చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన మాజీ జవానులు సలగల నారాయణ, దాసరి ఆదాం, జీవరత్నం, మార్పు ఇర్మియా, రమేష్‌బాబు, సలగల శ్రీను, ఆలీసమ్మ, సుబ్బారావు, చిట్టిబాబు, సంగీతరావులకు గతంలోనే ఒక్కొక్కరికీ 50 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈక్రమంలోనే వారికి తాత్కాలిక పట్టాను కూడా అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి వారికి శాశ్వత పట్టాను అందించేందుకు చేపట్టిన ప్రక్రియలో భాగంగా స్థానికేతర ఇబ్బందులపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి స్వయంగా విచారణ చేపట్టారు. భూములను పరిశీలించి కొంతమంది రైతులను విచారణ చేశారు. విచారణ పెండింగ్‌లో ఉన్న రైతులను కార్యాలయానికి పిలిపించి వివరణ తీసుకోవాలని అధికారులకు ఆర్డీవో సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్‌లు. జవానులు, రైతులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నాగమ్మ

పంగులూరు, జూలై 27 : వైసీపీ హయాంలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను లబ్ధిదారులు డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో మ్యాత్యూబాబు అన్నారు. పంగులూరు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. హౌసింగ్ ఏఈ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పీఎంఏవైలో మంజూరైన గృహాలలో ప్రభుత్వం కేటాయించిన స్థలాలు 89, సొంత స్థలాలు 250 ఇళ్ల నిర్మాణం జరిగిందని, డిసెంబర్‌తో పథకం పూర్తవుతున్నందున లబ్ధిదారులు వెంటనే నిర్మాణాల ను వేగవంతం చేయాలన్నారు. సీసీఆర్సీ కార్డులు పొందేందుకు కౌలు రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, 30 శాతం సబ్సిడీపై మినప విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. తెల్ల పశువులలో ముత్త చర్మవ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. గోకులం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు షెడ్ల నిర్మాణానికి 90 శాతం, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ షెడ్లకు 70 శాతం సబ్సిడీపై ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ మంత్రి గొట్టిపాటి సహకారంతో అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామని ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఎంఈవో వీరాంజనేయులు, పీఆర్ ఏఈ రామకుమార్, విద్యుత్ ఏఈ అంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, ఏపీఎం జ్యోతి ప్రసాద్, డీటీ ఆదినారాయణ, కార్యదర్శి సునీత వివరాలను అందచేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో నీటి పరీక్షలు

పంగులూరు, జూలై 27 : మండలంలోని నూజెళ్లపల్లి, చందలూరు గ్రామాలలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో శనివారం రక్షిత మంచినీటి పథకాలు, పాఠశాలలు, నివాస గృహ సముదాయాలలో నీటిశుద్ధి పరీక్షలు నిర్వహించారు. ప్రజలు వినియోగిస్తున్న తాగునీరు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించారు. వర్షాల కారణంగా సీజనల్‌గా సంక్రమించే డయేరియా వ్యాధిగురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.సుధీర్, సెంట్రటీమ్ మెంబర్ కె.సుజాత, మురళి, కార్యదర్శి వందనం, హెచ్‌ఎం వీరాంజనేయులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న ప్రతినిధులు

వీఆర్‌ఏకు నివాళి

సంతమాగులూరు, జూలై 27 : మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ అంగలకుదిటి కోటేశ్వరరావు (56) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతా రామారావు, డిప్యూటీ తహసీల్దారు రాఘవరావు, వీఆర్‌ఏ శ్యామ్, కరీం, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, వీఆర్‌ఏలు కాల్వ దేవదానం, షేక్‌ఆదాం షఫీ, ఇబ్రాయేలు, రాఘవరావు తదితరులు పాల్గొని కోటేశ్వరరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .



కోటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

కలాం చిరస్మరణీయుడు

ఎమ్మెల్యే కొండయ్య



టీడీపీ కార్యాలయంలో కలాం చిత్రపట్టం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 27 : మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతిగడించిన ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ యువత కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చిత్తశుద్ధి అంకిత భావం, సేవాతత్పరతకు ఆయన నిలువెత్తు ప్రతిరూపమని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు జీ చంద్రమౌళి, కౌత వరపు జనార్దనరావు పాల్గొన్నారు.

మండల పరిధిలోని ఈపురుపాలెం పంచాయతీ సావరపాలెంలో శనివారం రాత్రి నిర్వహించిన పోలేమర్మ కొలుపులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

కలాంకు నివాళి

అద్దంకిటౌన్ : అద్దంకిలోని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ కార్యాలయంలో భారత మాజీ రాష్ట్రపతి కలాం వర్ధంతి సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు ఆయన చిత్రపటాని పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, మురళిసుధాకరరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళికృష్ణ , డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి, పసుపులేటి అంజనేయులు పాల్గొన్నారు.

మార్టూరు : అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని వలపర్ల హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ కరిముల్లా, కొండపల్లి వెంకయ్య, గద్దం మస్తాన్‌వలి, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎం, ఉపవిద్యాశాఖాధికారి నిర్మలాదేవి ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ తవ్వా ఆదినారాయణ, మాజీ ఛైర్మన్ వెలగా రామాంజనేయులు, ఉపాధ్యాయులు కేశినేని వెంకటేశ్వర్లు, కె ప్రమీల, రవిదేవరాజు పాల్గొన్నారు.





కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రోటరీ సభ్యులు.. వలపర్లలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కంటి రోగులతో మాట్లాడుతున్న వైద్యులు

180 మందికి ఉచిత కంటి అద్దాల పంపిణీ

పంగులూరు, జూలై 27 : రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. గత నెల 27, 29, 30 తేదీలలో శుక్లముల శస్త్ర చికిత్స చేయించుకున్న 180 మందికి పెదకాకాని శంకర్ కంటి వైద్యశాల నేత్ర వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను ఉచితంగా అందజేసినట్లు క్లబ్ క్యాంప్ ఛైర్మన్ వీరరాఘవయ్య రోటరీ సేవలను వివరించారు. కార్యక్రమంలో శంకర్ కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ యోగేష్ కుమార్, డాక్టర్ మువ్వా జాగృతి, డాక్టర్ ఇకగ్లాకోమాలు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు షేక్ కాలేషావలి, రోటరీ ప్రతినిధులు బాచిన వెంకట రామారావు, ఇమ్మడిశెట్టి సుబ్బారావు, విశ్రాంత సైంటిస్ట్ రాయిణి రామారావు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు

విద్యార్థులకు వృద్ధ రైతు సాయం

పర్చూరు, జూలై 27 : పేదరికం విద్యకు దూరం కాకూడదన్న సంకల్పంతో ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న నిరుపేద వృద్ధ రైతు దాతృత్వం వెలకట్టలేనిదని ప్రధానోపాధ్యాయులు కేడీవీ ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పర్చూరు ఎంపీపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు నూతలపాడు గ్రామానికి చెందిన చిమటా వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో సమకూర్చిన నోట్‌పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ తనకున్న కొద్దిపాటి భూమితో వ్యవసాయం చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటూ విద్యార్థుల అభ్యున్నతికి రెండు దశాబ్దాలుగా సాయం చేస్తున్నారని కొనియాడారు. అనంతరం దాత వెంకటేశ్వర్లును సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.హేమలత, బి.నాగలక్ష్మి, బొజ్జా సురేష్, హనుమంతురావు, పీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ఎంపీపీ ఆనందకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందకుమారి

పర్చూరు, జూలై 27: అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి అన్నారు. శనివారం మండల విద్యావనరుల సమావేశం హాల్‌లో సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఆధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో భాగంగా నూతన ప్రభుత్వ ఏర్పాటు, హ్యాట్రిక విజేత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సమావేశంలో పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. దేవరపల్లి ప్రధాన రహదారి కూడలిలో సిమెంట్ రోడ్డులపై మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు కాపు రవిచంద్ర అన్నారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎక్కడ మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి అనేక ఏళ్లు గడిచిందని, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. సీడీపీవో మాట్లాడుతూ 4 నుంచి ఐదు ఏళ్ల వయస్సు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తున్నారని దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు లేక వెలవెల బోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వి.వెంకట్రామయ్య, ఇన్‌చార్జి తహశీల్దార్ శ్రీనివాసరావు, ఏఈ రమేష్ నాయక్, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.